

తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 278 బుధవారం, నవంబర్ 11, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 8 రూ. 2.00

ఓటమితో ట్రంప్‌కు 'జ్ఞానోదయం'



వాషింగ్టన్, సాక్షర: మధ్యంతర ఎన్నికల్లో భారీ ఎదురుదెబ్బ తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు జ్ఞానోదయం కలిగింది. తన వలసవాద విధానం 'మరీ కఠినంగా' ఉందని ఆయన ఒప్పుకున్నారు. రానున్న సంవత్సరాల్లో డెమోక్రటిక్ పార్టీతో కలసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ వెల్లడించారు.

పూర్తిగా 4 లో

మమతకు ఢిల్లీ పోలీసుల నోటీసులు..



పశ్చిమబెంగాల్ మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. 2013లో పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌లో నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని కోరుతూ.. ఈ నోటీసులు అందజేశారు.

పూర్తిగా 3 లో

మోదీ బస్తర్ ప్రసంగంపై రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్..



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పర్యటనలో ప్రధానమంత్రి మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

పూర్తిగా 2 లో

ధరణి దర్యాప్తు వేగవంతం



(హైదరాబాద్, సాక్షర): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిజిటల్ విప్లవంగా ప్రచారం చేసుకుని తీసుకొచ్చిన ధరణి భూముల పోర్టల్‌లో జరిగిన సంచలన అక్రమాలపై తెలంగాణ సీఐడీ ఉక్కుపాదం మోపడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

పూర్తిగా 3 లో

ముఖ్యమంత్రి.. ఉస్మానియాకు ఇస్తామన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ?

- వీసీ ఉద్యోగులను పట్టించుకోకుండా ప్రభుత్వానికి గులాం గిరి చేస్తున్నడు
- ఏడాదిన్నరగా ఉస్మానియా నాన్ టీచింగ్ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవటం లేదు
- ఉస్మానియా నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలపై గవర్నర్ స్పందించాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపిన టీఆర్ఎస్ చీఫ్

హైదరాబాద్ , సాక్షర: ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ స్టాఫ్ శ్రమను, రక్తాన్ని దోచుకుంటున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకుంటామని, వర్సిటీకి వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జాడలేకుండా పోయాడని ధ్వజమెత్తారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఉస్మానియా నాన్ టీచింగ్ స్టాఫ్ వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద చేపట్టిన ఆందోళనకు కవిత మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 35 ఏళ్లుగా ఉస్మానియాలో నాన్ టీచింగ్ స్టాఫ్ కు అన్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితే తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఉండటం క్షమించరని నేరమన్నారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో ఉద్యోగులు, ప్రొఫెసర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్నట్లుగానే ఉద్యోగి ఏడ్చిన యూనివర్సిటీ బాగుండదన్నారు. వీసీని చరిత్ర క్షమించదు నాన్ టీచింగ్ ఉద్యోగులంతా సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వారికి అండగా ఉండాల్సిన వీసీ.. ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారని కవిత మండిపడ్డారు. టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండగా వారిని కాదని కొత్త వాళ్లను నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ముందు ఉద్యోగులపై ప్రేమ చూపించాలని కోరారు. ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని వీసీ ఇబ్బందులు పెడుతున్నాడని మండిపడ్డారు. ఉస్మానియాకు 105 ఏళ్లలో తొలిసారి మాదిగా బిడ్డను వీసీని చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నాడని..కానీ నిధులు ఇవ్వకపోతే ఆయన మాత్రం ఏం చేస్తాడని ప్రశ్నించారు. నిధులు ఇవ్వకుండా వీసీ ని బలి చేసే ప్రయత్నం చేస్తున్నారా? లేదంటే వీసీయే ప్రభుత్వం కోసం ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నాడా అని నిలదీశారు. అటానమస్ గా ఉండి ఉద్యోగులకు కోసం పోరాటం చేయాల్సిన వీసీ ప్రభుత్వానికి గులాం గిరి చేయటం మంచిది కాదని చెప్పారు. యూనివర్సిటీ కోసం ప్రభుత్వం తో కొట్లాడి బాగు చేసుకున్న వీసీలను చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని..

మిగతా 4 లో



కరవుతో ఇబ్బందుల్లో రైతులు..



★ పంట రుణాల రీషెడ్యూల్‌కు భట్టి ఆదేశాలు

(హైదరాబాద్, సాక్షర): రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రత్యేక రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని.. రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలని... అర్హులైన రైతుల పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. ఆ పంటలకు రుణాలు అందించాలి: రబీ సీజన్‌కు కొత్త పంట రుణాలను సకాలంలో అందించాలని భట్టి సూచించారు. బ్యాంకుల చుట్టూ రైతులు తిరిగే పరిస్థితి ఉండకూడదని తెలిపారు. విద్య, గృహ రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా ఉండాలని నిర్దేశించారు. ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాలు పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని.

3 లో



ఈనెల 19న సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

పేజీ 4



రాజన్న ఆలయంలో కార్తీక మాసోత్సవాలు..

పేజీ 4



వనపర్తి జిల్లాలో 900 ఏళ్ల నాటి శాసనం..

పేజీ 7

టాలీవుడ్ లో ఇడుపు కాయితాలు



(హైదరాబాద్, సాక్షర): సినిమా ప్రపంచంలో ప్రేమలు ఈజీగానే పుడతాయి. అందులో కొన్ని మాత్రమే వివాహాల దాకా వెళ్తాయి. ప్రేమలు ఎంత వేగంగా అయితే వార్తల్లో నిలుస్తాయో.. పెళ్లిలు కూడా అంతే వేగంగా జరిగిపోతాయి. ఆ తర్వాత కొంతకాలానికి విడాకులు కూడా అదే స్థాయిలో సంచలనంగా మారుతుంటాయి. తెరమీద తమ కెమిస్ట్రీతో ప్రేక్షకులను ఆకట్టుకునే జంటలు.. రియల్ లైఫ్ లో ఒకటైతారు. కానీ, కొన్ని సందర్భాలలో ఆ బంధం ఎక్కువ కాలం ఉండదు. మనస్పర్థలు వచ్చేస్తుంటాయి. వ్యక్తిగత అభిప్రాయాలు.. ఇతర కారణాలు.. మొత్తానికి విడిపోవాల్సి వస్తుంది.తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం.. సినీ నటుడు పవన్ కళ్యాణ్.. ఆయన భార్య అన్నా లెజ్ నోవా విడిపోయారు.

3 లో

ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!



(హైదరాబాద్, సాక్షర): ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి.

2 లో

హైదరాబాద్ వాసుల తాగునీటి కష్టాలకు చెక్?



(హైదరాబాద్, సాక్షర): ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సింగూరు-మంజీరా జలవనరుల్లో నీటి లభ్యత తగ్గుతున్న దృష్ట్యా హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) గోదావరి అదనపు జలాలను నగరానికి తరలించేందుకు ఘన్ పూర్ వద్ద చేపడుతున్న పైప్‌లైన్ అనుసంధాన పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

3 లో

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే టీజీఎస్ ఆర్టీసీ ధ్యేయం



(హైదరాబాద్, సాక్షర): రాష్ట్రవ్యాప్తంగా బస్సుల్లో ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా 'తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ' (TGSRTC) కీలక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. బస్ స్టేషన్లలో రద్దీ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడంతో పాటు, ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు సంస్థ సరికొత్త కార్యాచరణ సిద్ధం చేసింది..ప్రయాణీకులకు సౌకర్యాలను మెరుగుపరచడం, బస్ స్టేషన్ల నిర్వహణను బలోపేతం చేయడం, ప్రయాణీకుల రాకపోకలు సజావుగా సాగేలా చూడటంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన బస్ స్టేషన్లలో వసతులను మరింత విస్తరించడం కోసం యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ప్రతిరోజూ 5,000 మందికి పైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 ప్రధాన బస్ స్టేషన్లను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే ప్రత్యేకంగా గుర్తించి, ఆ ప్రదేశాలలో మెరుగైన ప్రయాణీకుల సమాచార మరియు ప్రసార సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ 86 బస్ స్టేషన్లన్నింటిలోనూ ప్రయాణికుల అవసరం కోసం ఒక కంట్రోలర్ ను నియించడంతో పాటూ ప్రత్యేక విచారణ, సంప్రదింపు నంబర్లను ఏర్పాటు చేశారు.

పూర్తిగా 2 లో

సంపాదకీయం

ఎల్ నినో కేంద్రసాయం ఎక్కడ



ప్రకృతి ప్రకోపిస్తే పంటలు ఎండిపోతాయి. వర్షాలు ముఖం చాటేస్తే పొలాలు బీళ్లుగా మారతాయి. కానీ ప్రకృతి వైపరీత్యాల కంటే ప్రభుత్వాల నిర్లక్ష్యం రైతులను ఎక్కువగా కుంగదీస్తుంది. ఎల్ నినో పరిస్థితులు దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. పంటలు చేతికందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, పాలకుల ప్రకటనలు మాత్రం కాగితాలకే పరి మితమవుతున్నాయనే విమర్శలున్నాయి. రైతు నష్టపోతున్నాడు. వ్యవసాయం సంక్షోభంలో పడుతోంది. పేద కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతోంది. అయి నా కేంద్రం నుంచి స్పష్టమైన కార్యాచరణ ఎక్కడ? రైతు కన్నీటికి విలువ లేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తెలంగాణలో 365 మండలాలను కరు వు ప్రాంతాలుగా ప్రకటించి రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం కేంద్రాన్ని కోరినట్లు నివేదికలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 388 మండలాలు కరువు ఎదుర్కొంటున్నాయి. కర్ణాటకలో 57.93 లక్షల హెక్టా ర్లలో పంట నష్టం జరిగినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంచనా. నష్టం విలువ రూ.62 వేల కోట్లకు పైగా ఉంటుందని పేర్కొంది. ఇవి ఆయా రాష్ట్రాలు వెల్లడించిన గణాంకాలు మాత్రమే. దేశంలోని అన్ని రాష్ట్రాల కు సంబంధించిన నష్టాలపై ఒకే విధమైన తుది కేంద్ర నివేదిక ప్రజల ముందుకు రావాల్సి ఉంది. రాష్ట్రాలు నిధులు కోరడం, కేంద్రం పరిశీలిస్తామని చెప్పడం, అధికారులు నివేదికలు తయారు చేయడం.. ఈ తంతు పూర్తయ్యేసరికి రైతు చేతిలో మిగిలేది అప్పులేనా? నష్టాన్ని అంచనా వేయ డానికే నెలలు పడితే రైతు కుటుంబాలు ఎలా జీవించాలి?రైతు ఎకరాకు పెట్టే పెట్టుబడి రోజురోజుకూ పెరుగుతోంది. విత్తనాలు, ఎరువు లు, పురుగుమందులు, కూలీల ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంట పూర్తిగా నష్టపోతే ఇచ్చే పరి మిత పరిహారం రైతును ఎలా ఆదుకుంటుంది? నష్టాన్ని అంచనా వేసే విధానం పారదర్శకంగా ఉండాలి. భూమి యజమానులకే కాకుండా కౌలు రైతులకు కూడా న్యాయం జరగాలి. పంటల బీమా పరిహారాన్ని నెలల తరబడి పెండింగ్లో పెట్ట కుండా తక్షణమే చెల్లించాలి. వ్యవసాయ రుణాల వసూళ్లను వాయిదా వేయాలి. తదుపరి పంట సాగుకు పెట్టుబడి సాయం అందించాలి. కరువు ప్రభావం పొలాలకే పరిమితం కాదు. పంటల దిగుబడులు తగ్గితే ఆహార ధాన్యాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. రైతు ఆదాయం పడిపోతుంది. కూలీలకు పనులు తగ్గుతాయి. చివరకు పేద, మధ్యతరగతి కుటుంబాల వంటగదిపై ధరల భారం పడుతుంది. ప్రస్తుతం ప్రజా పంపి ణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు బియ్యం, గోధుమలు ఉచితంగా అందుతున్నాయి. కానీ బియ్యం ఒక్కటే కుటుంబా నికి సంపూర్ణ ఆహార భద్రత కల్పించదు. కందిపప్పు, శనగపప్పు, వంటనూనె, చక్కెర వంటి నిత్యావసర సరుకులను కూడా సబ్సిడీపై అందించాల్సిన అవసరం ఉంది. కేంద్రం కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రకటించిన ప్రణాళికలు క్షేత్రస్థా యిలో అమలుకావాలి. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. తక్కువ నీటితో పండే పంటలకు ప్రోత్సాహం ఇవ్వాలి. విత్తనాలు, ఎరువులు అందించాలి. పశువులకు పశుగ్రాసం,గ్రామాలకు తాగునీరు అందిం చాలి. ఉపాధి పనులను విస్తరించి గ్రామీణ కుటుంబాలకు ఆదాయం కల్పించాలి. కరువు అనేది ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు. ఇది దేశ ఆహార భద్రతకు సంబంధించిన సంక్షోభం. ఇలాంటి సమయంలో రాజకీయ విభేదాలు, నిధుల విషయంలో వివక్ష, అధికారుల కాలయాపనకు తావుండకూడదు. కేంద్రం రాష్ట్రాలకు అండగా నిలవాలి. రాష్ట్రాలు రైతులకు నేరుగా సహా యం అందించాలి. ప్రకటించిన పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.ప్రకృతి వైపరీత్యాలను ఆపడం ప్రభుత్వాల చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ వాటి ప్రభావంతో ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడటం మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. రైతు పంట పండిస్తేనే దేశానికి అన్నం అందుతుంది. రైతు నష్టపోతే దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడుతుంది. ప్రకటనలతో రైతు కడుపు నిండదు.అప్పులు తీరవు. సమీక్షలతో పం టలు పండవు. కేంద్రం ఇప్పటికైనా మేల్కొనాలి. నష్టాలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి. తక్షణమే నిధులు మంజూరు చేయాలి. రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి. పేదలకు నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలి. రైతు కన్నీరు తుడవని పాలనకు ప్రజల సమస్యలు పరిష్కరించిన ఘనత ఎలా దక్కుతుంది? రైతుకు భరోసా.. పేదలకు ఆహార భద్రత.. ఇవి హామీలు కాదు, ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన కనీస బాధ్యతలు.


మొదటి పేజీ తరువాయి మోదీ బస్తర్ ప్రసంగంపై రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్..

దేశ సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, సైన్యాన్ని గౌరవించడంలో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ వరుసగా విఫలమవుతూనే ఉన్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బస్తర్ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి వేడుకలు జరుపుకుని వారిలో నైతిక స్థైర్యాన్ని నింపారని రాంచందర్ రావు పేర్కొన్నారు. అయితే గతంలో బస్తర్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులైనప్పుడు ఆ ఘటనలను కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ఖండించలేదని దుయ్యబట్టారు. బస్తర్‌లో నక్సలైట్ల హింసను గానీ, పుల్వామాలో జవాన్ల వీరమరణాన్ని గానీ, ఉగ్రవాద దాడులను గానీ ఖండించే ధైర్యం రాహుల్ గాంధీకి ఎన్నడూ లేదని, కనీసం బాధితులకు సానుభూతి కూడా తెలపలేదని ఆరోపించారు. ఇటీవల బస్తర్ పర్యటనలో మోదీ మాట్లాడుతూ... ఆయుధాలు పట్టిన నక్సలిజం అంతమవుతున్నప్పటికీ, వివిధ సంస్థల్లో చొరబడిన "మేధో నక్సల్స్" రూపంలో ఇంకా ముప్పు పొంచి ఉందని వ్యాఖ్యానించారు. దీనిపై రాహుల్ గాంధీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ... విపక్షాలను ప్రధాని నక్సల్స్‌గా ముద్రవేస్తున్నారని ఆరోపిస్తూ, దేశద్రోహి ఎవరో చర్చించేందుకు రావాలని బహిరంగ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై రామచందర్ రావు స్పందిస్తూ... రాహుల్ గాంధీ వియత్నాం, రష్యా, అమెరికా వంటి దేశాలకు పారిపోకుండా, నేరుగా పార్లమెంట్‌కు వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలో పాల్గొనాలని హితవు పలికారు.

మొదటి పేజీ తరువాయి ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో AQI ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సోనియా గాంధీ పుస్తకంపై బీజేపీ ఫైర్..



(న్యూఢిల్లీ, సాక్షర): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'పై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ పుస్తకం నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చి, వారి పాపాలను శుభ్రపరిచే ఒక 'వైట్‌వాషింగ్' ప్రయత్నమని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆరోపించారు. తాజాగా ఈ పుస్తకం విడుదలైన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటని, చివరికి ఆమె కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సమయంలో ఇందిర తన చిన్న కుమారుడు సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే, జరిగిన నష్టంలో చాలా వరకు నివారించి ఉండేవారని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలను కేశవన్ తోసిపుచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలను అంగీకరించకుండా, దాన్ని ఒక సాధారణ పొరపాటుగా చిత్రీకరించి, సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పుస్తకంలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన గురించి ప్రస్తావిస్తూ తాను ఏడ్చానని సోనియా చెప్పడాన్ని కేశవన్ తప్పుబట్టారు. "బాబ్రీ మసీదు కోసం కన్నీళ్లు పెట్టుకున్న సోనియా గాంధీ, కాంగ్రెస్ హయాంలో 1984లో జరిగిన సిక్కుల ఊచకోతలో వేలాది మంది అమాయకులు చనిపోయినప్పుడు కనీసం ఒక్క కన్నీటి చుక్కైనా కార్చారా?" అని ఆయన ప్రశ్నించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు, బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి గురించి ఎప్పుడైనా బాధపడ్డారా అని నిలదీశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ ఆత్మకథ విడుదలకు ముందు జరిగిన పరిణామాలను కూడా కేశవన్ గుర్తుచేశారు. "2014లో నట్వర్ సింగ్ తన ఆత్మకథ 'వన్ లైఫ్ ఈజ్ నాట్ ఎనఫ్' విడుదలకు ముందు సోనియా గాంధీ ఆయన్ను ఎందుకు కలిశారు? 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు జరిగిన పరిణామాల గురించి నట్వర్ సింగ్ ఏం రాస్తారోనన్న భయంతోనే ఆయన్ను కలిశారా? ఈ విషయాలపై తన పుస్తకంలో సోనియా స్పష్టత ఇస్తారా?" అని కేశవన్ ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు 55 ఏళ్ల కాంగ్రెస్ పాలన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం కలిగించిందని, ప్రధాని నరేంద్ర మోదీ ఆ చారిత్రక తప్పిదాలను సరిదిద్దుతున్నారని ఆయన పేర్కొన్నారు.

శ్రీజ కుటుంబ సభ్యులకు కేటీఆర్ భరోసా



కనగల్, సాక్షర: నల్లగొండ జిల్లా కనగల్ మండలం శాబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన కోయ యాదగిరి రెడ్డి- రూప దంపతుల ఏకైక కుమార్తె శ్రీజ ఈ నెల 2 న అమెరికా బోస్టన్‌లో కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. శ్రీజ బోస్టన్ యూనివర్సిటీలో చదువుకుంటుంది. ఈ నెల 2వ తేదీన మిత్రులతో పుట్టినరోజు వేడుకకు వెళ్లి తను ఒక్కతే బయటికి వెళ్లింది. ఆ తర్వాత ఆమె మిత్రులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు ఆచూకీ కనుగొనలేకపోయారు. దాంతో తీవ్ర ఆందోళనలో కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులను నేడు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శాబ్దుల్లాపురం గ్రామంలో పరామర్శించారు. తమను ఏ నాయకుడు పట్టించుకోవట్లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో అక్కడి నుండి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాట్లాడి ఆ కుటుంబానికి సాయం చేయాల్సిందిగా అర్థించారు. కేటీఆర్ వెంటనే స్పందించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భయపడకండి. ధైర్యంగా ఉండండి. ఏమీ కాదు. మీ అమ్మాయి తిరిగి వస్తుంది. వివరాలు ఇవ్వండి. అక్కడ తెలిసిన వారితో మాట్లాడుతానని వారికి కేటీఆర్ భరోసా కల్పించారు. కంచర్లతో తనకు వివరాలు వెంటనే పంపాల్సిందిగా సూచించారు. అదేవిధంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి కూడా ఫోన్‌లో శ్రీజ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం కంచర్ల మాట్లాడుతూ.. యాదగిరి రెడ్డి దంపతుల ఏకైక కుమార్తె ఆచూకీ లభ్యంగాక వారు పడుతున్న ఆవేదన తనకు బాధ కలిగించిందని, విషయం చెప్పగానే కేటీఆర్ స్పందించి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి తన మిత్రుల ద్వారా వారికి సహకారం అందిస్తానని తెలియజేయడం ఆ కుటుంబానికి ఊరట కలిగించిందన్నారు. తాము ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీం పాషా, బీఆర్ఎస్ కనగల్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్య, రావుల శ్రీనివాసరెడ్డి, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, కడారి కృష్ణయ్య ఉన్నారు.

ఈ నెల 13న యుగాంతం.. ప్రపంచం అంతం కాబోతోందా?

- 60 ఏళ్ల క్రితం శాస్త్రవేత్తల జోస్యం మళ్లీ వైరల్!

న్యూఢిల్లీ,సాక్షర: మూడు రోజుల్లో ప్రపంచం అంతం కాబోతున్నదా? 1960 నాటి జోస్యం నిజమవుతుందా? అనే విషయాలు తాజాగా చర్చనీయాంశం అయ్యాయి. జనాభా పెరిగిపోతే, ప్రజలకు తగినంత ఆహారాన్ని అందించే స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులు పెరగబోవని, ఆకలి చావులు పెరుగుతాయని శాస్త్రవేత్తలు 1960వ దశాబ్దంలో ఆందోళన వ్యక్తం చేశారు. “డూమ్స్‌డే : ఫ్రైడే 13 నవంబర్ 2026” శీర్షికతో ‘సైన్స్’లో ప్రచురితమైన వ్యాసంలో, 2026 నవంబర్ 13నాటికి మానవ జనాభా అనంతం అవుతుందని ప్రొఫెసర్ హీంజ్ వోన్ ఫోర్‌స్టెర్ బృందం చెప్పింది. జనాభా ఎంత వేగంగా పెరిగినప్పటికీ, ఫుడ్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ సైన్స్ కూడా అదే వేగంతో అభివృద్ధి చెందుతాయని ఫోర్‌స్టెర్ వాదించారు. ఆయన గణిత సూత్రాల ఆధారంగా డూమ్స్‌డేను లెక్కించగా, జియాలజిస్ట్ డాక్టర్ మైఖేల్ టెక్లా మాత్రం సూర్యుడి నుంచి మునుపెన్నడూ లేనంత తీవ్రమైన శక్తి 2026 నవంబర్ 13న విడుదలవుతుందని, భూమి అయస్కాంత క్షేత్రంలో తీవ్రమైన అంతరాయాలు ఏర్పడతాయని, ఫలితంగా భూమిపై విపరీతమైన విధ్వంసం జరుగుతుందని చెప్పారు. 3 కారణాలు ఆశాజనకం: 13వ తారీఖు వచ్చేస్తోందనే ఆందోళన అక్కర్లేదని చెప్పడానికి 3 కారణాలు ఉన్నాయి. వాటిలో మొదటిది, ఫోర్‌స్టెర్ కేవలం గణిత సూత్రాన్ని మాత్రమే చెప్పారు. ప్రస్తుతం అది నిజమవడం అసాధ్యం. రెండో కారణం ఏమిటంటే, డాక్టర్ మైఖేల్ చెప్పినదాంట్లో చాలా లోపాలు ఉన్నాయి. సూర్యుడిలో తరచూ అసాధారణ కార్యకలాపాలు జరుగుతూ ఉంటాయి. కేవలం ఒక రోజులో మొత్తం భూమిని నాశనం చేసే స్థాయిలో అవి ప్రమాదకరం కాదు. మూడో కారణం ఏమిటంటే, విశ్వాన్ని శాటిలైట్స్ నిరంతరం గమనిస్తూ ఉంటాయి. ఏదైనా అసాధారణమైన ఖగోళ సంఘటన జరగబోతూ ఉంటే, దానిని ముందుగానే గుర్తించవచ్చు.

మొదటి పేజీ తరువాయి ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే టీజీఎస్ ఆర్టీసీ ధ్యేయం

దీనివల్ల ప్రయాణికులు తమకు కావలసిన బస్సు సర్వీసులు మరియు సమయాలకు సంబంధించిన వివరాలను ఎలాంటి ఆటంకం లేకుండా తెలుసుకోగలుగుతారు. అంతేకాకుండా బస్సు కార్యకలాపాలపై స్పష్టమైన మరియు తాజా సమాచారాన్ని అందించేందుకు వీలుగా కొత్త బస్సు టైమ్‌టేబుల్ బోర్డులను కూడా అన్ని బస్ స్టేషన్లలో త్వరలోనే ప్రదర్శించనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులకు సంబంధించి ముఖ్యంగా మొదటి మరియు చివరి బస్సు సమయాల గురించి క్రమం తప్పకుండా సమాచారం అందించేందుకు బస్ స్టేషన్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ (PAS) ఏర్పాటు చేశారు. ప్రయాణికుల భద్రత, బస్ స్టాండ్లలో రద్దీ నిర్వహణ మరియు కార్యకలాపాల పర్యవేక్షణను మరింత పటిష్టం చేసేందుకు త్వరలో అన్ని బస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ఈ ప్రతిపాదిత సీసీటీవీ వ్యవస్థలను సంబంధిత ప్రాంతీయ కార్యాలయాలు, ప్రధాన కార్యాలయానికి నేరుగా అనుసంధానిస్తారు. దీనివల్ల ప్రయాణీకుల రాకపోకలు, బస్ స్టాండ్లలో రద్దీ పరిస్థితులు మరియు బస్ స్టేషన్ కార్యకలాపాలను కేంద్రీకృత పర్యవేక్షణ ద్వారా నిరంతరం సమర్థవంతంగా పరిశీలించడానికి వీలవుతుంది. టీజీఎస్ఆర్టీసీ బస్ స్టేషన్లలో ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడం, రద్దీ నిర్వహణను నిర్ధారించడం మరియు సురక్షితమైన, మరింత సౌకర్యవంతమైన, మెరుగైన వ్యవస్థీకృత ప్రయాణాన్ని అందించడమే యాజమాన్యం ప్రధాన ఉద్దేశ్యం. తెలంగాణ వ్యాప్తంగా ప్రయాణీకుల సౌకర్యాలను నిరంతరం మెరుగుపరచడానికి మరియు ప్రజా రవాణా సేవలను మరింత బలోపేతం చేయడానికి టీజీఎస్ఆర్టీసీ ఎల్లవేళలా కట్టుబడి ఉందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి వెల్లడించారు

మొదటి పేజీ తరువాయి హైదరాబాద్ వాసుల తాగునీటి కష్టాలకు చెక్?

ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, గోదావరి జలాలను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువును ఒక్కరోజు కూడా పొడిగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.పైప్‌లైన్ నిర్మాణ పనులను రెండు వైపుల నుంచి సమాంతరంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా అనుసంధానం చేయాలని ఎండీ ఆదేశించారు. ఏ నిర్మాణ సంస్థ ఎంత దూరం పైప్‌లైన్ ఏర్పాటు చేసిందనేది ముఖ్యం కాదని, పనులు పూర్తయి పైప్‌లైన్ అనుసంధానం కావడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పనుల పరిధికి సంబంధించిన బిల్లుల సర్దుబాటును తర్వాత పరిశీలించవచ్చని, ప్రస్తుతం పనుల పూర్తికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధాన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు రోజుకు ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో ప్రత్యేక కార్మిక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి షిఫ్టుకు వేర్వేరు బృందాలను నియమించి, పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా పనులు కొనసాగించాలన్నారు. రాత్రివేళ పనులకు అవసరమైన ఫ్లడ్‌లైట్లు, యంత్ర సామగ్రి, ఇతర సౌకర్యాలను సమకూర్చుకోవాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధానానికి కీలకమైన రోడ్డు క్రాసింగ్ పనులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని ఎండీ ఆదేశించారు. అవసరమైన అనుమతులు, భద్రతా ఏర్పాట్లతో రాత్రి నుంచే రోడ్డు కటింగ్ పనులు ప్రారంభించి, రెండు మూడు రోజుల్లో పైపుల ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని సూచించారు. ఇందుకోసం అదనంగా రెండు మూడు ప్రత్యేక కార్మిక బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు.గోదావరి జలాల తరలింపునకు చేపడుతున్న పనులను వేగవంతం చేసేందుకు మిషన్ భగీరథ, అటవీశాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. పైప్‌లైన్ అనుసంధానానికి అవసరమైన సాంకేతిక సహకారం, యంత్రాలు, మానవ వనరులను ఆయా శాఖల సహకారంతో సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న గోదావరి ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమైన సాంకేతిక నిపుణులు, కార్మిక బృందాలు, ఎక్స్‌కవేటర్లు, డ్రిల్లింగ్ యంత్రాలు, ఇతర భారీ యంత్ర సామగ్రిని అవసరమైన మేరకు ఈ పనులకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను తాత్కాలికంగా నిలిపివేసి, అక్కడి యంత్రాలు, వాహనాలు, సిబ్బందిని ఈ ప్రాజెక్టుకు వినియోగించుకోవాలన్నారు.రాబోయే వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకోవాలని ఎండీ సూచించారు. ముఖ్యంగా సింగూరు–మంజీరా జలవనరులపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలను అందించే ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పైప్‌లైన్ అనుసంధాన పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని, ఎదురయ్యే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తికావడం జలమండలి ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, అధికారులు, నిర్మాణ సంస్థలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు.నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, రోజుకు 40 ఎంజీడీల గోదావరి అదనపు జలాల సరఫరాకు మార్గం సుగమం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు

18న నితిన్ నబిన్ మహాపాదయాత్రకు హాజరై మద్దతివ్వండి:కేంద్ర మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి



(కరీంనగర్, సాక్షర): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే పూచీ నాది. కేంద్ర, రాష్ట్రాల సహకారంతో అభివృద్ధి చేస్తున్నా. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సహకారంతో కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తెస్తున్నా. అండగా నిలిచి మరింత ఆదరించండి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ''సర్'' పేరిట రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు చేస్తున్న దాడిని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఈనెల 18న కరీంనగర్ వస్తున్నారని, నిర్వహించే మహాపాదయాత్రకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి ఒక్కరూ హాజరై మద్దతు తెలపాలని కోరారు. 50 వ డివిజన్ లోని జ్యోతినగర్ ఎక్స్‌ప్లోరికా స్కూల్ సమీపంలో రూ. 79.20 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న ఆర్.సి.సి. డ్రైన్, స్లాబ్ కల్వర్ట్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ రావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో కాసేపు ముచ్చటించారు. కరీంనగర్ పార్లమెంట్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసే పూచీ నాది. మోదీ, అమిత్ షా, నితిన్ నబిన్ సహకారంతో కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తెస్తున్నా. అభివృద్ధి పనులు చేస్తున్నా. ఈనెల 18న నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్ర కు కరీంనగర్ పార్లమెంట్ నుండి ప్రతి ఒక్కరూ హాజరై సంఘీభావం తెలిపండిఅని కోరారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

- దక్షిణాది రాష్ట్రాలకు వర్ష సూచన



నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) అంచనా వేసింది. ఏర్పడిన తర్వాత 24 గంటల్లో మరింత స్పష్టమైన అల్పపీడనంగా మారి వాయవ్య దిశగా కదిలే అవకాశం వుంది. నవంబర్ 14 నుంచి 16 వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం వుంది. తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో నవంబర్ 10, 11, 15, 16 తేదీల్లో భారీ వర్ష సూచన. నవంబర్ 16న కేరళలోనూ అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం వుంది.. అండమాన్ నికోబార్ దీవుల్లో నవంబర్ 10 నుంచి 14 వరకు భారీ వర్ష సూచన. నవంబర్ 12న కశ్మీర్ లోయలో భారీ వర్షాలు, మంచు కురిసే అవకాశం వుంది. . తమిళనాడు పరిసరాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం వుంది. ఉత్తరాంధ్రకు ప్రత్యేకంగా: ప్రస్తుత IMD బులెటిన్‌లో భారీ వర్షాల హెచ్చరిక లేదు. నవంబర్ 14–16 మధ్య అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం మాత్రమే ఉంది. గమనిక: అల్పపీడనం ఏర్పడే అవకాశం మాత్రమే ఉంది. తుఫానుగా మారుతుందని లేదా ఏ ప్రాంతంలో తీరం దాటుతుందని IMD ఇంకా ప్రకటించలేదు. తదుపరి వాతావరణ బులెటిన్లను బట్టి పరిస్థితులు మారవచ్చు

మొదటి పేజీ తరువాయి ధరణి దర్యాప్తు వేగవంతం

సీఐడీ విభాగంతో పాటు ప్రత్యేక దర్యాప్తు బృందాలు రంగంలోకి దిగి హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డిలతో పాటు పలు జిల్లాల్లో ఏకకాలంలో రహస్య దాడులు, ఆపరేషన్లు నిర్వహించాయి. ఈ క్రమంలో పోర్టల్ డెవలపర్లు, రెవెన్యూ ఆపరేటర్లు, డాక్యుమెంట్ రైటర్లతో పాటు పలువురు నిందితులను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకోవడం సంచలనం సృష్టిస్తోంది.ఫోరెన్సిక్ ఆడిట్‌లో లభించిన ఆధారాల ప్రకారం.. నాటి ప్రభుత్వంలోని కీలక పెద్దలు, నిబంధనలకు విరుద్ధంగా సెక్షన్ 22-ఏ కింద ఉన్న నిషేధిత జాబితా భూములు , కోట్లాది రూపాయల విలువైన అసైన్డ్ , సీలింగ్ మిగులు భూములను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ దిగ్గజాల పేరిట మార్చివేసినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. వ్యవస్థీకృతంగా డిజిటల్ రికార్డులను ట్యాంపర్ చేస్తూ, అధికారులపై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే నిషేధిత జాబితా నుంచి వేలాది ఎకరాలను తొలగించడం వెనుక కొందరు బీఆర్ఎస్ అగ్రనేతల ఆశీస్సులు ఉన్నాయని విచారణలో ప్రాథమికంగా వెల్లడవుతోంది.ఈ దర్యాప్తు పురోగతితో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ధరణి అనేది కేసీఆర్ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ కావడంతో, ఇందులో జరిగిన అవకతవకలు నేరుగా నాటి మంత్రివర్గం , ఐఏఎస్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాయి. సీఐడీ దర్యాప్తు కేవలం క్రింది స్థాయి ఆపరేటర్లకే పరిమితం కాకుండా, పొలిటికల్ మాస్టర్‌మైండ్స్ , బిజినెస్ నెట్‌వర్క్‌లను టార్గెట్ చేసుకుని సాగుతుండటంతో.. రాబోయే రోజుల్లో నాటి కీలక నేతలకు నోటీసులు జారీ అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సీఐడీ విచారణ వేగం వెనుక స్పష్టమైన రాజకీయ అజెండా ఉందనే ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ పాలనా లోపాలు, గ్యారెంటీల అమలులో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కక్షసాధింపు రాజకీయాల్లో భాగంలో ధరణి దర్యాప్తును రాజకీయాస్త్రంగా ఉపయోగిస్తోందని విమర్శిస్తున్నారు. అయితే రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం— బాధితులైన వేలాది మంది రైతులకు న్యాయం చేయడానికే, దోచుకున్న ప్రజా భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకే ఈ న్యాయపరమైన దర్యాప్తు జరుపుతున్నామని గట్టిగా సమర్థించుకుంటోంది.రికార్డుల డిజిటైజేషన్ పేరుతో భూ రికార్డుల అధికారాలను కేంద్రీకరించి, కొందరు వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా మార్పులు చేశారన్నది ప్రధాన నిరూపిత అంశంగా మారబోతోంది. డిజిటల్ ఫుట్‌ప్రింట్స్, లాగ్ ఫైల్స్, ఐపీ అడ్రస్‌లు ఆధారంగా దర్యాప్తు సాగుతుండటంతో ఆడిట్ ట్రయల్‌ను తప్పించుకోవడం నేతలకు దాదాపు అసాధ్యం. దర్యాప్తు సంస్థల వద్ద ఉన్న పక్కా సాంకేతిక ఆధారాలు బయటకు వస్తే, అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తుల జప్తుతో పాటు పెద్ద తలకాయల అరెస్టులు తప్పవని భావిస్తున్నారు. తెలంగాణలో ధరణి కుంభకోణం దర్యాప్తు కేవలం రెవెన్యూ వివాదం మాత్రమే కాదు, కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య సుదీర్ఘకాలం సాగే ప్రధాన రాజకీయ పోరాటంగా రూపాంతరం చెందింది. ఈ అక్రమాల మనీ ట్రయల్స్, భూ బదిలీల వెనుక ఉన్న నిజాన్ని సీఐడీ పూర్తిస్థాయిలో వెలుగులోకి తెస్తే.. అది బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద దెబ్బ కావడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని కీలక రాజకీయ పరిణామాలకు బాటలు వేస్తుంది.

నేర నియంత్రణపై నిఘా ఉంచుతూ .. ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే



(రాజన్న సిరిసిల్ల, సాక్షర): ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధులు, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను సమీక్షించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..నేర నియంత్రణపై నిరంతరం అప్రమత్తంగా ఉంటూ రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు స్టేషన్ పరిధిలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా కేసులు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కేసులకు సంబంధించిన వాహనాలను భద్రపరచాలని ఆదేశించారు.పోలీస్ అధికారులు బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, గ్రామాల్లో రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణయే లక్ష్యంగా ప్రతి రోజు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ ఉపేంద్ర చారి, లక్పతి, సిబ్బంది ఉన్నారు

మొదటి పేజీ తరువాయి టాలీవుడ్ లో ఇడుపు కాయితాలు

దీనికి సంబంధించి సంయుక్త ప్రకటన చేశారు. ఈ వ్యవహారం చర్చకు దారితీస్తోంది. దాదాపు 13 ఏళ్ల వైవాహిక ప్రయాణానికి వారిద్దరు ముగింపు పలకడం అభిమానులను ఆందోళన గురి చేస్తోంది. అయితే వీరిద్దరూ విడిపోవడం వెనుక ఉన్న కారణాలు ఇంతవరకూ బయటకి తెలియ రాలేదు. అయితే టాలీవుడ్ లో ఇలాంటి పరిణామాలు గతంలో కూడా చోటు చేసుకున్నాయి. అభిమానులకు ఆదర్శ జంటలుగా కనిపించిన పలువురు సెలబ్రిటీలు కూడా తమ వైవాహిక జీవితాన్ని కొనసాగించలేకపోయారు. పవన్ కళ్యాణ్ రేణు దేశాయ్ టాలీవుడ్ లో ఎక్కువగా చర్చకు వచ్చిన సెలబ్రిటీ విడాకుల వ్యవహారాలలో పవన్ కళ్యాణ్.. రేణు దేశాయ్ బంధం ఒకటి. బద్రి సినిమా సమయం లో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఆ తర్వాత కొంతకాలం సహజీవనం చేశారు. 2009లో వివాహం చేసుకున్నారు. వీరికి అకిరా నందన్.. ఆద్య అనే పిల్లలున్నారు. వీరి వైవాహిక బంధం ఎక్కువ కాలం కొనసాగలేదు. 2012లో ఇద్దరు విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ అన్నా లెజ్ నోవా ను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆమెతో కూడా విడిపోయారు. నాగచైతన్య సమంత టాలీవుడ్ లో అభిమానులను ఎక్కువగా ఆశ్చర్యానికి.. గురిచేసిన విడాకుల వ్యవహారంలో నాగచైతన్య, సమంత జంట ఒకటి. ఏం మాయ చేసావే సినిమాతో వీరిద్దరూ తెరమీద సంచలనం సృష్టించారు. ఆ తర్వాత వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. కొన్ని సంవత్సరాల ప్రేమ ప్రయాణం తర్వాత 2017 లో గోవాలో అత్యంత ఘనంగా పెళ్లి చేసుకున్నారు. మజిలీ సినిమాలో భార్యాభర్తలు గా నటించి ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నారు. రియల్ లైఫ్ లో కూడా ఎంతో అన్యోన్యంగా కనిపించేవారు. అయితే, నాలుగేళ్ల వైవాహిక జీవితం తర్వాత 2021 అక్టోబర్ లో విడిపోతున్నట్టు ప్రకటించారు. తమ నిర్ణయాన్ని గౌరవించాలని అభిమానులను కోరారు. ఆ తర్వాత వారిద్దరూ తమ కెరియర్లలో ముందుకు సాగుతున్నారు. నాగ చైతన్య శోభితను పెళ్లి చేసుకుంటే.. సమంత రాజ్ అనే దర్శకుడిని పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం ఆమె గర్భవతి. మంచు మనోజ్, ప్రణతి రెడ్డి మంచు కుటుంబం నుంచి వచ్చిన హీరో మంచు మనోజ్. ఈయన తన వైవాహిక జీవితంలో విడాకులు తీసుకున్నారు. 2015లో ప్రణతి రెడ్డిని ఈయన పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం తర్వాత ఇద్దరు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి చివరికి 2019లో విడాకులు తీసుకున్నట్టు మనోజ్ స్వయంగా ప్రకటించారు. తమ మధ్య విభేదాలు.. అనేక రకాల వేదనాభరితమైన పరిస్థితులు ఎదురయ్యాయని.. అన్ని ఆలోచించిన తర్వాత విడివిడిగా జీవించాలని నిర్ణయించుకున్నామని అప్పట్లో మనోజ్ వివరించారు. ఆ తర్వాత ఆయన భూమా మౌనికా రెడ్డిని రెండవ పెళ్లి చేసుకున్నారు. రెండో భార్యకు అప్పటికే వివాహం జరిగింది. ఒక కుమారుడు కూడా ఉన్నారు. ఆమె కూడా భర్తతో విడాకులు తీసుకుంది. మౌనిక ద్వారా మనోజ్ ఒక బిడ్డను కన్నారు. తన రెండవ భార్య మొదటి భర్త ద్వారా కలిగిన కుమారుడిని కూడా సొంత కుమారుడిగా స్వీకరించారు. పవన్ కళ్యాణ్ నందిని పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంలో రేణు దేశాయ్ కంటే, అన్నా లెజ్ నోవా కంటే ముందుగా ఒక వైవాహిక బంధం ఉంది. 1997లో నందిని అనే అమ్మాయిని అతడు పెళ్లి చేసుకున్నాడు. అదే ఆ బంధం ఎక్కువ కాలం ఉండలేదు. 2008లో వీరు విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత రేణు దేశాయ్ తో వివాహం.. అనంతరం అన్నా తో వివాహం జరిగిపోయాయి.. మొత్తంగా పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంలో మూడు వైవాహిక బంధాలు ఎక్కువ కాలం నిలబలేదు.వీరు మాత్రమే కాకుండా పవన్ రెండవ సోదరుడు కొణిదెల నాగబాబు కుమార్తె కొణిదెల నిహారిక కూడా తన భర్తతో విడాకులు తీసుకున్నారు. ఆమె ఇప్పుడు నిర్మాతగా రాణిస్తున్నారు. ఫింక్ ఎలిఫెంట్ అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి, సినిమాలు నిర్మిస్తున్నారు. కమిటీ కుర్రోళ్లు అనే సినిమా ద్వారా జాతీయ అవార్డు కూడా దక్కించుకున్నారు.సినిమా ఇండస్ట్రీలో తారల వ్యక్తిగత జీవితంపై అభిమానులకు ఎక్కువగా ఆసక్తి ఉంటుంది. మీడియా కూడా వారి వార్తలను విపరీతంగా ఫోకస్ చేస్తూ ఉంటుంది. అందువల్లే వారి ప్రేమలు.. పెళ్లిళ్లు.. విడాకులు వంటి వ్యవహారాలు నిత్యం వార్తలో నిలుస్తూ ఉంటాయి. అయితే ఒక జంట విడిపోవడానికి వెనుక ఉన్న కారణాలేంటి.. ఏం జరిగింది అనే విషయాలు స్వయంగా వారు చెప్తే తప్ప బయటకి తెలియదు. కొన్ని మీడియా సంస్థలు ఇటువంటి వ్యవహారాలకు మసాలా దట్టించి ప్రసారం చేస్తుంటాయి. మన సమాజంలో నిజాలు కంటే ఊహాగానాలకే విలువ ఎక్కువ కాబట్టి.. జనాలు కూడా వీటిని నమ్ముతుంటారు. అయితే సెలబ్రిటీలు విడాకులు తీసుకున్న తర్వాత కొందరు తమ కెరియర్ల మీద దృష్టి పెట్టారు. మరికొందరు కొత్త జీవితాన్ని మొదలుపెట్టారు. ఇంకొందరు పిల్లల బాధ్యతలను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఏదిఏమైనప్పటికీ.. తెరమీద కనిపించే సెలబ్రెటీల జీవితాలు.. రియల్ లైఫ్ లు వేరే విధంగా ఉంటాయి. ఇలాంటి సమయంలో వారి వ్యక్తిగత గోప్యతకు.. వ్యక్తిగత నిర్ణయాలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అభిమానుల మీద ఉంటుంది.

మొదటి పేజీ తరువాయి కరవుతో ఇబ్బందుల్లో రైతులు..

. 111 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలకు రుణాలు అందించాలని.. పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యానికి ఆర్థిక సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు: రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. 10 నుంచి 15 శాతం రైతు కుటుంబాలకు అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ.2 లక్షల వరకు రుణాలపై పరిశీలన చేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. ఈ నెల 19 నాటికి రాజీవ్ యువ వికాసం అమలుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. రైతులు తదుపరి వ్యవసాయ సీజన్‌ను ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి మమతకు ఢిల్లీ పోలీసుల నోటీసులు..

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) సెక్షన్ 160 కింద ఈ నోటీసులు జారీ చేసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. విచారణాధికారిని ఎప్పుడు, ఎక్కడ కలవాలన్నది ఆమె సౌకర్యానుసారం నిర్ణయించుకోవచ్చని సూచించారు. అసలేం జరిగిందంటే?: 2013లో ఢిల్లీలోని నాటి ప్రణాళికా సంఘం కార్యాలయం సమీపంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఆ సమయంలో మమత తన పార్టీ నేతలు, మంత్రులతో కలిసి అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆమె బృందాన్ని చుట్టుముట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. అప్పటి బెంగాల్ ఆర్థిక మంత్రి అమిత్ మిత్రాపై దాడి చేసి, దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు రాగా.. ఈ ఘటనపై పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, ఉద్యోగులపై దాడి చేయడం, అల్లర్లు సృష్టించడం వంటి అభియోగాలతో ఐపీసీ సెక్షన్లు 186, 353, 332, 147, 149, 34 కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో నాటి ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రితబ్రత బెనర్జీని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే.. ఈ కేసులో మమత పాత్రపై మరిన్ని వివరాలు సేకరించేందుకు పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేయాలని భావిస్తున్నారు. కేసుకు సంబంధించిన పరిస్థితులపై ఆమెకు అవగాహన ఉందని, అందుకే సాక్షిగా విచారణకు సహకరించాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే ఈ నోటీసులపై మమత లేదా టీఎంసీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

హోటల్స్ కు మద్దతుగా ఓవైసీ

(హైదరాబాద్, సాక్షర): భాగ్యనగరంలో ఇటీవల కాలంలో టీజీ సేఫ్ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలతో హోటళ్ల యజమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారికి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బాహాటంగా మద్దతుగా నిలిచారు. ట్విన్ సిటీస్ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన తెలంగాణ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతిని కలిశారు. నగరవ్యాప్తంగా ఆహార భద్రతా అధికారులు చేపడుతున్న తనిఖీలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, చట్టబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి మాత్రమే సాగాలని, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసే ధోరణికి స్వస్తి పలకాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆయన గట్టిగా కోరారు.తనిఖీల పేరిట నిబంధనలను అతిక్రమించి ఏకపక్ష చర్యలకు పాల్పడటం సరికాదని అసదుద్దీన్ నేతృత్వంలోని బృందం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లింది. నిబంధనల ప్రకారం ఏదైనా హోటల్‌లో లోపాలు కనిపిస్తే.. వెంటనే తీవ్ర చర్యలు తీసుకోకుండా తొలుత ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి నిర్ణీత గడువు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఆ చట్టబద్ధమైన ప్రక్రియను దాటవేసి సోషల్ మీడియాలో విజువల్స్ విడుదల చేయడం, వ్యాపార సంస్థల ప్రతిష్టను మసకబార్చడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార సంస్కృతి, గుర్తింపును పరిరక్షించడంలో హోటల్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని అసదుద్దీన్ వర్గం పేర్కొంది. వేలాది మంది కార్మికులు, చిరువ్యాపారుల జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉన్న వేళ.. కేవలం చిన్నపాటి లోపాలను సైతం భూతద్దంలో చూపిస్తూ హోటళ్లను సీజ్ చేయడం లేదా లైసెన్సులు రద్దు చేయడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార నాణ్యతను కాపాడటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారుల వైఖరి పారదర్శకంగా, సమానంగా ఉండాలే తప్ప.. ఎంపిక చేసుకున్న కొన్ని సంస్థలనే లక్ష్యంగా చేసుకుని వేధించేలా ఉండకూడదని వ్యాపారులు వాపోయారు.పౌరుల ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో, వ్యాపారాలు గౌరవప్రదంగా సాగే వాతావరణం కల్పించడం కూడా అంతే ఆవశ్యకమని అసదుద్దీన్ అంటున్నారు. హోటల్ నిర్వాహకులకు సరైన మార్గదర్శకాలు ఇచ్చి, వారిలో అవగాహన పెంచేలా అధికారులు సహకారాత్మక ధోరణితో వ్యవహరించాలని కోరారు

ఈనెల 19న సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన



(సిద్దిపేట, సాక్షర): ఈనెల 19న రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేటలో ఇందిరమ్మ బీమా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు . మంగళవారం రాష్ట్ర మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ కె. హైమావతి తో కలిసి సిద్దిపేట పట్టణంలోని వివిధ వార్డులలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కొండ భూదేవి గార్డెన్స్ లో సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట మున్సిపాలిటీ, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, నారాయణరావుపేట మరియు నంగునూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు 1121ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ. రాష్ట్ర ప్రజలందరి మేలుకోసం ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును ప్రభుత్వం అందిస్తుందని ఈ స్క్రీన్ ద్వారా ఒక్కొక్క లబ్ధిదారులు నెలకు 1200 రూపాయలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమంలో ద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 9,000 కోట్ల రూపాయలను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. దీంతో నిరుపేద మహిళలు వివిధ పనులను మొత్తం అయ్యే ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకొని పిల్లల చదువులకు వినియోగిస్తున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం రాగానే రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని 10 లక్షలకు పెంచడం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుందని అన్నారు. వీటితోపాటు ఎల్ ఓ సీలు ఇప్పించడం మరియు సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల కోట్ల రూపాయల చెక్కులను అందించడం జరిగిందని తెలిపారు. నిరుపేదలకు సొంతింటి కలను సహకారం చేసేందుకు ఇప్పటివరకు సిద్దిపేట నియోజకవర్గంలో 5500 ఇందిరమ్మ ఇండ్లను నిరుపేదలకు అందించడం జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇండ్లను నిరుపేదలకు ఇచ్చామని, మరో 2 లక్షల ఇండ్లను ప్రభుత్వం రానున్న రెండు సంవత్సరాల్లో అందిస్తుందని తెలిపారు. పేద విద్యార్థులకు మంచి విద్యా, నాణ్యమైన భోజన సౌకర్యాన్ని అందజేస్తూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేశామని తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాలులేక రానున్న రోజులలో మంచినీటికి కొరత ఏర్పడుద్ది కాబట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించడం పై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, ఆత్మ చైర్మన్ పూజల గోపికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, సిద్దిపేట ఆర్డిఓ సదానందం, నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రాఘవేంద్ర కరిమల విద్యార్థి ప్రతిభ



(జన్నారం, సాక్షర): మండల కేంద్రంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడని రాఘవేంద్ర సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ తెలిపారు.రాఘవేంద్ర కరిమల కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొట్టే అభిషేక్ దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభతో జాతీయ స్థాయిలో 7వ స్థానం పొందాడని ఆయన తెలిపారు.మా విద్యా సంస్థలలోని సిబ్బంది విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ క్రీడలు, సామాజిక సేవ తదితర రంగాలలో ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నారని, ఏకాగ్రత, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని అభిషేక్ నిరూపించాడని ఆయన అన్నారు. సందర్భంగా చైర్మన్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బంది అభిషేక్‌ను అభినందించారు.

మొదటి పేజీ తరువాయి ఓటమితో ట్రంప్‌కు 'జ్ఞానోదయం'

నవంబర్ 3న జరిగిన మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటిపైనా పట్టు సాధించారు. ఈ క్రమంలో రిపబ్లికన్ల అధీనంలో ఉన్న అనేక స్థానాలను కైవసం చేసుకుని ట్రంప్‌ను భారీగా దెబ్బతీశారు. సీబీఎస్ సంస్థకు చెందిన 60 మినిట్స్ కార్యక్రమంలో తన పరిపాలన చేపట్టిన బహిష్కరణ(డిపోర్టేషన్) విధానంపై అడిగిన ప్రశ్నకు ట్రంప్ జవాబిస్తూ ఇది మరీ కఠినంగా ఉండి ఉండవచ్చు అని అభిప్రాయపడ్డారు. తాను చేపట్టిన కఠినమైన వలస విధానాలు ఎన్నికల్లో తనకు ప్రయోజనాన్ని, నష్టాన్ని రెండింటినీ కలిగించాయని ఆయన పేర్కొన్నారు. సరిహద్దులను మూసివేసినందుకు తనకు ఏ+గ్రేడ్ లభించిందని, అలాగే నేరస్థులను దేశం నుంచి బయటకు పంపినందుకు మంచి గుర్తింపు వచ్చిందని ట్రంప్ చెప్పారు. అయితే మంచి ఉద్యోగాలు కలిగి ఉండి, కేవలం చట్టాన్ని ఉల్లంఘించి..అంటే దేశంలోకి అక్రమంగా ప్రవేశించడం ద్వారా తప్పుచేసిన వారిని కూడా పంపేయడం వల్ల తనకు నష్టం జరిగింది అని ఆయన అన్నారు. ఇరాన్ విషయంలో కొత్తగా ఉద్రిక్తతలు పెరిగే అవకాశం లేదని, దీంతో యుద్ధం ఉండకపోవచ్చు అన్నట్టు ట్రంప్ సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో అన్నారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ కు సమ్మె నోటీసు అందజేసిన ఆశాకార్యకర్తలు

- డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె....



(రాజన్న సిరిసిల్ల, సాక్షర): ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్(CITU)సిఐటీయు ప్రకటించింది. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా సి ఐ టీ యు కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో వేములవాడ, చందుర్తి, కోనరావుపేట పీహెచ్‌సీల పరిధిలోని ఆశా కార్యకర్తలు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని, ఆశా వర్కర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్‌ను కోరారు. కార్యక్రమంలో జయశీల, గాయత్రి, జమున, లత, మమత, లక్ష్మి, అరుణ, జ్యోతి, రత్నమాల, హేమలత, ఉమ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు పోయినా ఆగని పోరాటం

- టెంట్‌లోనే దీపావళి వేడుకలు.. కుటుంబాలకు దూరంగా సమ్మె కొనసాగిస్తున్న ఉద్యోగులు 29వ రోజుకు చేరుకున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని జేఏసీ హెచ్చరించింది.నిర్మల్ జిల్లా ఎన్ హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె మంగళవారం 29వ రోజుకు చేరుకుంది. ఎన్ హెచ్ఎం ఉద్యోగులు దీపావళి పండుగను సైతం కుటుంబాలకు దూరంగా ఉండి సమ్మె శిబిరంలోనే జరుపుకున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ వేల మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పిస్తూ 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలకు పిలిచి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాజన్న ఆలయంలో కార్తీక మాసోత్సవాలు..



- నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు

(వేములవాడ, సాక్షర): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు నెలరోజుల పాటు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నారు. కార్తీక సోమవారాలు, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. అయితే రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాన ఆలయంలో స్వామివారికి ఏకాంతంగా పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రాజన్న ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోనూ నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. కార్తీక మాసంలోని ప్రతి సోమవారం ప్రధాన ఆలయంలో శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి ఏకాంతంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. అదేవిధంగా శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోనూ స్వామివారికి రుద్రాభిషేకం జరపనున్నారు. ఈ నెల 21వ తేదీన కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం శ్రీకృష్ణ తులసి కల్యాణం జరగనుంది. అలాగే నవంబర్ 24న కార్తీక పౌర్ణమి, వైకుంఠ చతుర్దశి సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అన్నపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తీక పౌర్ణమి రోజున శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం వద్ద సంప్రదాయబద్ధంగా జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి ప్రధాన ఆలయంలో నిషిపూజ అనంతరం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. కార్తీక మాసంలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రధాన ఆలయంలో స్వామివారికి ఏకాంతంగా పూజలు కొనసాగనున్నాయి. భక్తులు ఆలయ అధికారుల సూచనలు పాటిస్తూ దర్శన ఏర్పాట్లకు సహకరించాలని ఆలయ వర్గాలు కోరుతున్నాయి.

సిటీలో హై-ఎండ్ ఓవర్ సప్లై

(హైదరాబాద్, సాక్షర): కోవిడ్ తదుపరి కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రూ. 2 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన లగ్జరీ,అల్ట్రా-లగ్జరీ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ కనిపించింది. దాంతో ప్రముఖ బిల్డర్లు, డెవలపర్లు అంతా తమ దృష్టిని లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలపైనే కేంద్రీకరించారు. అయితే, ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగకపోవడం , వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవ్వడంతో ప్రస్తుతం భాగ్యనగరంలో లగ్జరీ విభాగంలో అమ్ముడవని గృహాల సంఖ్య గణనీయంగా పెరిగిపోయి హై-ఎండ్ ఓవర్ సప్లై పరిస్థితి ఏర్పడింది.నగరంలో భూముల ధరలు, నిర్మాణ వ్యయం పెరగడంతో పాటు ఇళ్ల ధరలు సైతం సామాన్యులకు అందుబాటులో లేకుండా పెరిగిపోవడం కొనుగోలుదారుల్లో నిరాశను నింపింది. రూ. 2 కోట్ల పైబడిన ఆస్తులను కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్న ఉన్నత వర్గాల డిమాండ్ ఒక స్థాయికి చేరుకుని సంతృప్త స్థితికి రావడంతో, మార్కెట్‌లో భారీగా నిర్మించిన లగ్జరీ ఫ్లాట్లు అమ్ముడవకుండా మిగిలిపోతున్నాయి. ఇది డెవలపర్ల మూలధనం నిలిచిపోయేలా చేసి, ప్రాజెక్టు నిర్వహణపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది.ఈ సవాలును అధిగమించేందుకు నగర రియల్టర్లు తమ వ్యూహాన్ని వేగంగా మార్చుకుంటున్నారు. విలాసవంతమైన లగ్జరీ నిర్మాణాల కంటే నిజమైన కొనుగోలుదారులు అధికంగా ఉన్న 70 లక్షల నుంచి 1.20 కోట్ల బడ్జెట్ ప్రాజెక్ట్‌లను డిజైన్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మధ్యతరగతి , ఎగువ-మధ్యతరగతి ఉద్యోగులు, ఐటీ రంగానికి చెందిన యువ కొనుగోలుదారుల బడ్జెట్‌కు తగినట్లుగా 2BHK, 3BHK ఫ్లాట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కొత్త ప్రణాళికలు రచిస్తున్నారు.హైదరాబాద్ ఐటీ కారిడార్లకు కాస్త దూరంగా ఉన్న గ్రోత్ కారిడార్లు, నివాస ప్రాంతాలలో ఈ మిడ్-సెగ్మెంట్ గృహాల నిర్మాణాలు వేగవంతమవుతున్నాయి. అనవసరమైన విలాసవంతమైన ఆమేనిటీస్‌ను తగ్గించి, స్థల వృధా లేకుండా సమర్థవంతమైన లేఅవుట్లతో అందుబాటు ధరల్లో ఇళ్లను అందించడం ద్వారా మార్కెట్‌లో నిలిచిపోయిన క్రయవిక్రయాలకు మళ్లీ ఊపిరి పోయవచ్చని రియల్ ఎస్టేట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌ను మరింత సుస్థిరమైన దారిలో నిలబెడుతోంది.

విద్య, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి -జిల్లా కలెక్టర్ కె. హరిత



(ఆసిఫాబాద్, సాక్షర) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం రెబ్బెన మండలంలో పర్యటించిన ఆమె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, క్యాష్‌బుక్‌ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిపాలనలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామపంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

మొదటి పేజీ తరువాయి ముఖ్యమంత్రి.. ఉస్మానియాకు ఇస్తామన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ?

కానీ ప్రభుత్వం కోసం వర్సిటీ ప్రయోజనాలను తాకట్టు పెడితే చరిత్ర క్షమించదని వీసీని హెచ్చరించారు. ఏడాదిన్నరగా పట్టించుకోవటం లేదు ఏడాదిన్నరగా నాన్ టీచింగ్ స్టాఫ్ ఆందోళనలు, ధర్నాలు చేస్తుంటే ఎందుకు స్పందించటం లేదని కవిత ప్రశ్నించారు. నాన్ పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే ప్రయోజనాలు లేకుండా చేస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాల్లో ప్రదర్శించే తెలితేటలను ముఖ్యమంత్రి వద్ద ప్రదర్శించి ఉద్యోగులకు మేలు చేయాలని కోరారు. ఓయూలో 85 శాతం లోకల్ వాళ్లనే నియమించుకోవాల్సి ఉన్నప్పటికీ బీహార్, యూపీ వాళ్లను సెక్యూరిటీ కోసం నియమిస్తున్నారన్నారు. యూనివర్సిటీలో జరిగే అవినీతి బయట పడకుండా ఉండేందుకే బయట వాళ్లను నియమిస్తున్నారా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. నాన్ టీచింగ్ స్టాఫ్ సమస్య లపై వర్సిటీ ఛాన్సలర్ గా ఉన్న గవర్నర్ ఎందుకు స్పందించటం లేదని ఆమె ప్రశ్నించారు. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోని నాన్ టీచింగ్ స్టాఫ్ కు మేలు జరిగేలా చూడాలని గవర్నర్ ను కోరారు. ఓపీఎస్ అమలు చేయాలి ఉస్మానియాలో ఉద్యోగులకు ఓపీఎస్ స్కీమ్ వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి పచ్చి అబద్దాలు చెప్పారని కవిత అన్నారు. 2001 నుంచి 2004 వరకు ఉన్న వారికి ఈ స్కీమ్ వర్తింపజేయాలన్నారు. 2004 నుంచి ఉన్న వారికి కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను వర్తింపజేయాలన్నారు. ఏటా ఉద్యోగులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని క్రమం తప్పకుండా చెల్లించాలని, చనిపోయిన టైమ్ స్కేల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవస్థ తీసేసి అందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్కీమ్ ను రెగ్యులర్ ఎంప్లాయిస్ మాదిరిగా వర్తింజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. అదే విధంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులైనా శ్రీకాంత్ గౌడ్, ఆకాష్ లకు అండగా నిలవాలని ఉద్యోగులను ఈ సందర్భంగా కవిత కోరారు.

టీపీసీసీ అధికార ప్రతినిధిగా మద్దెల సంతోష్ ముదిరాజ్

• సంతోష్ నియామకంపై మహాసభ నేతల హర్షం.. సీఎంకు కృతజ్ఞతలు



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) ఉస్మానియా యూనివర్సిటీ ఓయూ జేఏసీ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి అనేక కేసులు బనాయించబడి పలుమార్లు జైలు జీవితం అనుభవించిన జనగామ జిల్లాకు చెందిన మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దెల సంతోష్ ముదిరాజును టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి బీఆర్ బిందు ముదిరాజ్, ఆదిలాబాద్ జిల్లా మన ముదిరాజ్ మహాసభ యూత్ అధ్యక్షులు కంచం లక్ష్మణ్ ముదిరాజులు హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు వారు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ముదిరాజులతో సమావేశమై ఇప్పుడిప్పుడే రాజకీయంగా ఎదుగుతున్న ముదిరాజుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నిలబడడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఇటీవలనే పండుగ సాయన్న వర్ధంతి, జయంతి కార్యక్రమాలను అధికారికంగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా ఓయూ జేఏసీ నేత మద్దెల సంతోష్ ముదిరాజును టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.ఈ నియామకంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు, మీడియా సెల్ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కు మన ముదిరాజ్ మహాసభ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే కాలంలో ముదిరాజులకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్ పర్సన్లుగా లేదా చైర్మన్లుగా నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ముగిసిన ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కు తిరిగి చైర్మన్ నియమించడంతో పాటు రాష్ట్రంలో అత్యధిక శాతం మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్న ముదిరాజులకే రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఫెడరేషన్ చైర్మన్ ని ఇవ్వాలని, అదే విధంగా ఇతర చట్టబద్ధత కలిగిన సంస్థల్లో ముదిరాజులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కావలి అంజనేయులు ముదిరాజ్, డాక్టర్ బోయిని జగన్మోహన్ ముదిరాజ్, నల్లగొండ జిల్లా అధ్యక్షులు పులకరం సైదులు ముదిరాజ్, కోదాడ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మూసి శ్రీనివాస్ ముదిరాజ్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నార్ల శ్రీనివాస్ ముదిరాజ్, వనపర్తి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు ముదిరాజ్, నారాయణపేట జిల్లా అధ్యక్షులు వాకిటి శ్రీనివాస్ ముదిరాజ్, పరికి నియోజకవర్గ సమన్వయ సంఘాల అధ్యక్షులు రామస్వామి ముదిరాజ్, మెదక్ జిల్లా రామాయంపేట్ కు పోచ మల్ల అశ్విని ముదిరాజ్, సిద్దిపేట జిల్లాకు చెందిన కోడూరి శ్రీదేవి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

సువాసనలు.. క్యాన్సర్ ముప్పు ఎంతవరకు?

ఉదయం స్నానం తర్వాత డియోడరెంట్ స్ప్రే, బయటకు వెళ్లే ముందు పెర్ఫ్యూమ్, చెమట వాసన నియంత్రణకు యాంటీపెర్స్పిరెంట్.. ఇవి నిత్యజీవితంలో భాగమయ్యాయి. సువాసన ఉత్పత్తుల వినియోగం పెరుగుతున్నా, వాటిలోని రసాయనాలు, తయారీ నాణ్యత, దీర్ఘకాలిక బహిర్గతంపై వినియోగదారులకు ఎంత అవగాహన ఉంది? ముఖ్యంగా క్యాన్సర్ ముప్పు నిజంగా ఎంతవరకు ఉంది? ప్రతి స్ప్రే క్యాన్సర్‌కు కారణమని భయపెట్టడం శాస్త్రీయంగా సరైంది కాదు. ప్రమాదమే లేదని కొట్టిపారేయడమూ సమంజసం కాదు. ఉత్పత్తిలోని పదార్థం, కలుషిత స్థాయి, వినియోగ పరిమాణం, శరీరంలోకి ప్రవేశించే మార్గం, బహిర్గతమయ్యే వ్యవధిని బట్టే ముప్పు మారుతుంది. బెంజీన్ కలుషితమే కీలక ఆందోళన అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధనా సంస్థ బెంజీన్‌ను మనుషుల్లో క్యాన్సర్ కలిగించే పదార్థంగా గ్రూప్-1లో వర్గీకరించింది. దీర్ఘకాలిక బహిర్గతం ముఖ్యంగా రక్త సంబంధిత క్యాన్సర్ అయిన లుకేమియాతో ముడిపడి ఉంది. అయితే బెంజీన్ సాధారణంగా సువాసన కోసం ఉద్దేశపూర్వకంగా కలిపే పదార్థం కాదు. తయారీ ప్రక్రియలో లేదా ఏరోసోల్ డబ్బాల్లోని ప్రొపెల్లెంట్ ద్వారా అనుకోకుండా కలుషితమయ్యే అవకాశం ఉంది. అమెరికాలో 2021 నవంబరులో ఓల్డ్ స్పైస్, సీక్రెట్ బ్రాండ్లకు చెందిన కొన్ని నిర్దిష్ట ఏరోసోల్ ఉత్పత్తులను, 2022లో స్యూర్, బ్రూట్, సువే ఉత్పత్తుల్లోని కొన్ని బ్యాచ్‌లను బెంజీన్ గుర్తించినందుకు వెనక్కి తీసుకున్నారు. ఈ ఘటనలు అన్ని డియోడరెంట్లలోనూ బెంజీన్ ఉందని నిరూపించవు. నిర్దిష్ట ఉత్పత్తుల నాణ్యతా లోపాన్ని మాత్రమే సూచిస్తాయి. 2026 నివేదికలో బయటపడిన గణాంకాలు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ 2026లో అందుబాటులోకి తెచ్చిన 2025 ఆర్థిక సంవత్సర నాణ్యతా నివేదికలో ఏరోసోల్ ఉత్పత్తుల పరీక్షల వివరాలు ఉన్నాయి. 72 ఏరోసోల్ యాంటీపెర్స్పిరెంట్ ఉత్పత్తులను పరిశీలించగా, బెంజీన్ సగటు స్థాయి మిలియన్ భాగాల్లో 0.09గా, గరిష్ఠంగా 1.0గా నమోదైంది. ఇవి అమెరికాలో పరీక్షించిన ఉత్పత్తుల గణాంకాలు మాత్రమే. భారత మార్కెట్‌కు ఇవి నేరుగా వర్తించవు. 2025 అక్టోబరులో ప్రచురితమైన టాక్సికాలజీ రిపోర్ట్స్ పరిశోధన కూడా డియోడరెంట్లు, సన్‌స్క్రీన్లలోని స్వల్ప బెంజీన్ కలుషితాన్ని అంచనా వేసింది. అధ్యయనం పరిశీలించిన వినియోగ పరిస్థితుల్లో క్యాన్సర్ ముప్పు తక్కువగా ఉందని పేర్కొంది. అయినప్పటికీ బెంజీన్ క్యాన్సర్ కారకమనే శాస్త్రీయ వాస్తవం మారదు. కలుషితాన్ని నివారించడం, గుర్తించడం అత్యవసరం. క్యాన్సర్ మాత్రమే కాదు.. శ్వాస సమస్యలూ... కొన్ని సువాసన పదార్థాలు సున్నితమైన వ్యక్తుల్లో ఆస్తమా లక్షణాలు, ఇతర శారీరక ఇబ్బందులను ప్రేరేపించవచ్చని అమెరికా పర్యావరణ పరిరక్షణ సంస్థ పేర్కొంటోంది. 2026 సెప్టెంబరులో ఎన్విరాన్‌మెంట్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమైన లండన్ అధ్యయనం 112 ఇళ్లలో ధూపం, సువాసన నూనె డిఫ్యూజర్లు, కొవ్వొత్తుల వినియోగంతో సూక్ష్మ ధూళి కణాలు పెరుగుతున్నట్లు గుర్తించింది. అయితే ఈ పరిశోధన డియోడరెంట్ స్ప్రేలపై జరగలేదు. కాబట్టి ఫలితాలను వాటికి నేరుగా అన్వయించలేం. ఏరోసోల్ ఉత్పత్తుల్లో ఉండే బ్యూటేన్, ప్రొపేన్ వంటి వాయువులను ఉద్దేశపూర్వకంగా పీల్చడం మాత్రం గుండె లయలో ప్రమాదకర మార్పులు, ప్రాణాపాయానికి దారితీయవచ్చు. సాధారణ వినియోగాన్ని ఇలాంటి దుర్వినియోగంతో కలిపి చూడకూడదు. నియంత్రణలో పారదర్శకత.. వినియోగంలో అప్రమత్తత... భారత్‌లో సౌందర్య సాధనాల తయారీ, దిగుమతులు ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం-1940, సౌందర్య సాధనాల నిబంధనలు-2020 పరిధిలో నియంత్రితమవుతున్నాయి. 2026 సెప్టెంబరులో సీడీఎస్‌సీఓ అనధికార సౌందర్య సాధనాల వినియోగంపై ప్రజారోగ్య హెచ్చరిక జారీ చేసింది. ఇది బెంజీన్ కలుషితంపై ప్రత్యేక హెచ్చరిక కాకపోయినా, ఉత్పత్తుల చట్టబద్ధత, నాణ్యతపై అప్రమత్తత అవసరాన్ని గుర్తుచేస్తోంది. ఏరోసోల్ ఉత్పత్తుల్లో కలుషితాల పరీక్షలు, బ్యాచ్ వివరాల గుర్తింపు, ఫిర్యాదుల పరిశీలన, అవసరమైనప్పుడు వేగవంతమైన రీకాల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. తయారీ సంస్థలు నాణ్యతా పరీక్షల్లో పారదర్శకత పాటించాలి. వినియోగదారులు నమ్మకమైన ఉత్పత్తులనే ఎంచుకుని, లేబుల్, గడువు, హెచ్చరికలు పరిశీలించాలి. గాలి ప్రసరణ ఉన్న ప్రదేశంలో సూచించిన మోతాదులోనే వాడాలి. ముఖం, ముక్కు వైపు నేరుగా స్ప్రే చేయకూడదు. ఇబ్బందులు కలిగితే వినియోగం నిలిపి వైద్య సలహా తీసుకోవాలి. సువాసన వ్యక్తిగత అభిరుచి కావచ్చు.. ఆరోగ్య భద్రత మాత్రం ప్రజా ప్రయోజనం. భయాందోళనలు కాదు, శాస్త్రీయ ఆధారాలు, కఠినమైన నాణ్యతా పరీక్షలు, పారదర్శక నియంత్రణే ప్రజలకు రక్షణ. పరిమళం కోసం ఆరోగ్యాన్ని పణంగా పెట్టాల్సిన అవసరం లేదు. -



వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, ఫోన్: 9640466464

కూలీలకు విరివిగా ఉపాధి కల్పించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

• జలసిరి పనులకు ప్రాధాన్యత ఇవ్వండి.. నిర్లక్ష్యం చేస్తే చర్యలు



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) వీబీజీ రాంజీ పథకం కింద విరివిగా పనులు గుర్తిస్తూ, కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి వీబీజీ రాంజీ పథకం అమలు తీరుపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏఈలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ప్రతి గ్రామంలో పనులను ఎంపిక చేస్తూ, కూలీలకు ఉపాధి కల్పించడం ద్వారా పని దినాల లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ సూచించారు. ఎల్ నినో ప్రభావంతో నెలకొని ఉన్న ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో వీబీజీ రాంజీ కింద పనులను విస్తృత స్థాయిలో గుర్తించడం ద్వారా కూలీలకు తగిన ఉపాధి కల్పించి ఆదుకున్నట్లు అవుతుందని అన్నారు. అంతేకాకుండా వర్షాభావం వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా, జలసిరి కార్యక్రమం కింద నిర్దేశించిన పనులను చేపట్టేందుకు ఇది ఎంతో ఉపయుక్తమైన సమయమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.ఫాంపాండ్స్, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, సోక్ పిట్లు, బోర్ వెల్ రీచార్జ్ గుంతలు వంటి పనులకు ప్రాధాన్యతనిస్తూ విరివిగా చేపట్టేలా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారి నేతృత్వంలో అన్ని మండలాలలో తక్షణమే సమావేశాలు ఏర్పాటు చేసుకుని, ఒక్కో గ్రామం వారీగా ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. గుర్తించిన పనులను సకాలంలో చేపడుతూ వారంవారం ప్రగతిని సమీక్షించాలని సూచించారు.కూలీల సంఖ్యను గణనీయంగా పెంచినట్లయితే తదనుగుణంగా మెటీరియల్ కంపోనెంట్ కేటాయించబడుతుందని అన్నారు. దీనివల్ల పల్లెలలో ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే పనులు అందుబాటులోకి వస్తాయని, కరువు పరిస్థితులను అధిగమించేందుకు కూడా ఇవి ఉపకరిస్తాయని గుర్తు చేశారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించే విషయంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని చోట మెట్లను నియమించుకుని పనులు పెద్ద ఎత్తున కొనసాగేలా

ఉపాధి సిబ్బందికి శిక్షణ



(జన్నారం, సాక్షర): మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని ఉపాధి సిబ్బందికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం, వారి విధులు, బాధ్యతలు తదితర విషయాలపై శిక్షణ అందించినట్లు మండల ఏపీఎం రవీందర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు డీఆర్డీఓ మోహన్, ఏపీఓలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు, 40 మంది మేట్లు పాల్గొన్నారని తెలిపారు.అదనపు డీఆర్డీఓ మోహన్ ఈ శిక్షణ ఉద్దేశం, దాని ఆవశ్యకత, పాటించవలసిన నిబంధనలు తదితర విషయాలను అందరికీ సూచించినట్లు ఆయన వివరించారు.

పసుపు రైతుల అభ్యున్నతే లక్ష్యంగా జాతీయ పసుపు బోర్డు కృషి : చైర్మన్ పల్లె గంగారెడ్డి

• ఆర్మూర్ మామిడిపల్లిలో రైతులకు బాయిలర్, పాలిషర్ యంత్రాల పంపిణీ



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) పసుపు రైతుల ఆర్థికాభివృద్ధితో పాటు వారి ఉత్పత్తులకు మెరుగైన ధర కల్పించడమే లక్ష్యంగా జాతీయ పసుపు బోర్డు అన్ని విధాల కృషి చేస్తుందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి పసుపు రైతులకు భరోసా కల్పించారు.జాతీయ పసుపు బోర్డు ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని మామిడిపల్లిలో రైతులకు బాయిలర్, పాలిషర్ యంత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ పసుపు సాగుకు ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి జాతీయ పసుపు బోర్డు కట్టుబడి ఉందన్నారు.ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పసుపు ఉడకబెట్టడం, పాలిషింగ్ ప్రక్రియలు మరింత సులభతరం అవుతాయని, తద్వారా ఉత్పత్తి నాణ్యత పెరిగి మార్కెట్‌లో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, పసుపు సాగు అభివృద్ధి, నాణ్యమైన ఉత్పత్తుల సాధనకు జాతీయ పసుపు బోర్డు నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల పనితీరు, వాటి వినియోగంపై అధికారులు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పసుపు బోర్డు కార్యదర్శి భవానీ, డిప్యూటీ డైరెక్టర్ ప్రత్యూష్ టీపీ, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ రాజమాణిక్యం, రాణి, జవహర్, జాతీయ పసుపు బోర్డు కార్యాలయ అధికారులు, యంత్రాల లబ్ధిదారులు, పెద్ద సంఖ్యలో పసుపు రైతులు పాల్గొన్నారు.

డప్పుల మోత.. ఆటపాటల సందడి..

• దండారితో దద్దరిల్లిన నగలగుంధీ ఆదివాసీలతో కలిసి సందడి చేసిన శ్యామ్ నాయక్, సుగుణ



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర) డప్పుల మోత, ఆటపాటల సందడి మధ్య దండారి ఉత్సవాలతో నగలగుంధీ దద్దరిల్లింది. ఆదివాసీలతో కలిసి శ్యామ్ నాయక్, సుగుణ వేడుకల్లో సందడి చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం కేరమేరి మండల పరిధిలోని నగలగుంధీ గ్రామాల్లో నిర్వహించిన ఆదివాసీ సంప్రదాయ పండుగ దండారి కార్యక్రమాల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షురాలు అత్రం సుగుణ పాల్గొని ఆదివాసీ సోదరులతో కలిసి వేడుకల్లో సందడి చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఆదివాసీ సంప్రదాయ కళాకారులు వారికి ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ నృత్యాలు, డప్పుల మోతలు, ఆటపాటల మధ్య దండారి ఉత్సవాలు ఉత్సాహంగా సాగాయి.ఈ సందర్భంగా అజ్మీరా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ దండారి పండుగ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆదివాసీ ఆచార వ్యవహారాలు, కళలు, సంస్కృతిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఆదివాసీ ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, విద్య, వైద్యం, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ అభివృద్ధి కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కేరమేరి మండల అధ్యక్షుడు సుజాత ఖాన్, మాజీ సర్పంచ్ జగన్నాథ, జాదవ్ ప్రకాష్, నాగేష్, తిరుపతి, బాపురావు, సుదర్శన్, దేవిదాద్, హనుమంతు, బాపురావు, దేవేందర్, ధర్ము, వినయ్ దేవర, జిదేశా, అయుబా ఖాన్, నాగేష్, శంకర్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ఆదివాసీ కళాకారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందూరులో స్టేడియం నిర్మిస్తామన్న ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని

• ఇందూరుకు స్టేడియం తీసుకురావడమే నా లక్ష్యం ఖైసర్ అథ్లెటిక్స్ అకాడమీ క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) ఇందూరులో స్టేడియం నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఇందూరులో స్టేడియం తీసుకురావడమే తన లక్ష్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఖైసర్ అథ్లెటిక్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని రాజారాం స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేడియం కోసం ఇప్పటికే అనేక సార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. ఇందూరులో స్టేడియం నిర్మిస్తామన్న ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని చెప్పారు. గత 10 ఏళ్లుగా నిర్విరామంగా అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కేవలం క్రీడా పోటీలనే కాకుండా పోలీసు, ఆర్మీ ఉద్యోగాలకు శిక్షణను కూడా ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో తర్ఫీదు తీసుకోవాలన్నారు. ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పుష్కలంగా లభిస్తుందన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే నగరానికి చెందిన హాకీ క్రీడాకారిణి ఎండల సౌందర్య, బాక్సర్లు నికత్ జరీన్, హుస్సాముద్దీన్, పర్వతారోహకురాలు పూర్ణా మలావత్ కు క్రీడా కోట కింద ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఖైసర్ అకాడమీ ఫౌండర్ ఖైసర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, కరాటే రమేష్, కార్పొరేటర్లు ఎండి అన్వర్ అమర్ సింగ్, మఠం పవన్, కో ఆప్షన్ మెంబర్ సురేందర్, ఎంపీజే అబ్దుల్ అజీజ్, అడ్వకేట్ జునేద్, యూనిస్ పాల్గొన్నారు.

యూడబ్ల్యూహెచ్ఎంఎస్ పోర్టల్ ద్వారానే సరుకుల ఇండెంట్



• స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు అందించే సరుకుల సరఫరాలో పారదర్శకత ఉండేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నాకాఫ్ ద్వారా వివిధ ప్రభుత్వ వసతి గృహాలు, కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలకు సరఫరా చేస్తున్న సరుకుల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన 'యూనిఫైడ్ వెల్ఫేర్ హాస్టల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' పోర్టల్ ద్వారా ఇండెంట్ నమోదు, తదితర అంశాలపై అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు, సలహాలు అందజేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నెలా 5వ తేదీ లోపు సంబంధిత అధికారులందరూ యూడబ్లుహెచ్ఎంఎస్ పోర్టల్ ద్వారా విధిగా ఇండెంట్ నమోదు చేసుకోవాలని ఆదేశించారు. వసతి గృహాలకు చేరే సరుకుల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే స్వీకరించాలని, ఒకవేళ నాణ్యత లోపిస్తే ఆ సరుకులను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకుండా వెంటనే వెనక్కి పంపించాలని తేల్చిచెప్పారు. సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి సోనియా , వివిధ వసతి గృహాల సంక్షేమాధికారులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, నాకాఫ్ ఇన్‌ఛార్జ్ రమాకాంత్, వంశీకృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దు

• గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కృషి చేయాలి ఎస్పీ అఖిల్ మహాజన్



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) పోలీసు సిబ్బంది విధులను క్రమశిక్షణతో, సమయపాలనతో, నిజాయితీగా నిర్వహిస్తూ పోలీసు వ్యవస్థ కీర్తి ప్రతిష్టలను పెంచేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో మెన్ బ్యారక్ పునరుద్ధరణతో పాటు నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడను జిల్లా ఎస్పీ ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ను సందర్శించి సిబ్బందితో సమావేశమై విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఆర్థిక నేరాల నియంత్రణకు పటిష్టమైన గస్తీ, పెట్రోలింగ్, బీట్ నిర్వహిస్తూ నేరాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.మండలంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేస్తూ గంజాయి రహిత జిల్లాగా ఆదిలాబాద్ ను తీర్చిదిద్దాలని తెలిపారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం అందించిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. గంజాయి రవాణా చేసినా, సేవించినా, వ్యాపారం చేసినా, పండించినా వారిపై చర్యలు తప్పవని అన్నారు. గంజాయి పండించిన వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు గంజాయిపై లేదా అసాంఘిక కార్యకలాపాలపై నేరుగా జిల్లా ఎస్పీ నిర్వహించే వాట్సాప్ నంబర్ 8712659973 కు సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించి సంబంధిత దర్యాప్తు అధికారులను నియమించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని, కేసులలో నిష్పక్షపాతంగా, సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలని తెలిపారు. నేరస్తులకు శిక్షలు పడినప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ రికార్డులు, రిసెప్షన్ సెంటర్ వివరాలను సీసీటీఎన్ఎస్ లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ రికార్డుల నిర్వహణలో ఆదిలాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉండేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా, ఎస్ఐ వి. విష్ణువర్ధన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోయం బాపూరావు సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు



(సాత్నాల, సాక్షర): సాత్నాల మండలం మెడిగుడ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు మాజీ ఎంపీ సోయం బాపూరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని మెడిగుడ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ నాయకులు సోమవారం మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సోయం బాపూరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ క్యాతం శివప్రసాద్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఏనుగు రవీందర్ రెడ్డి, పెందుర్ అన్ను, మడపచి వసంత్ రావ్, ఎస్సీ సెల్ సాత్నాల మండల ప్రెసిడెంట్ గుమ్మడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగాపుత్రులకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

• గవర్నర్ కోటాలో పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్కు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి

(హైదరాబాద్, సాక్షర): గంగాపుత్ర సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిన రఘు కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్లోని బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగపుత్ర సామాజిక వర్గం ఎన్నో ఏళ్లుగా రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఎదురుచూస్తోందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ ఉన్నత విద్యావంతురాలని, ఎల్ఎల్ఎం పూర్తి చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన వై. సత్యనారాయణ 1972 నుంచి 1978 వరకు, బి. బాలయ్య 1978 నుంచి 1983 వరకు ఎమ్మెల్యేలుగా పనిచేసి ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత తరానికి కూడా రాజకీయ అవకాశం కల్పించి గంగపుత్రుల ఆత్మగౌరవానికి గుర్తింపు ఇవ్వాలని డాక్టర్ రఘు కోరారు.

నేటి నుంచే కార్తీక మాసం ప్రారంభం..

• కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు

• శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులు

• హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో మార్మోగిన కీసరగుట్ట

మేడ్చల్–మల్కాజిగిరి: నేటి నుంచి పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కావడంతో ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్టకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో కీసరగుట్టలో భక్తి సందడి నెలకొంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో కీసరగుట్ట మార్మోగుతోంది. కార్తీక మాసం ఆరంభంతో శివభక్తులతో కీసరగుట్ట ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

విదేశీ పత్తి దిగుమతిని నిలిపివేయాలి



• దేశీయ పత్తి రైతులను ఆదుకోవాలి : కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి

(బోథ్, సాక్షర) పత్తి రైతులను ఆదుకోవాలి, లేకుంటే బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో పంట పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గిన సందర్భంలో భారతదేశ విపణిలోకి విదేశీ పత్తి దిగుమతులను ఆహ్వానించడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉందని బోథ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విదేశీ కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం చేసుకొని భారతదేశంలోకి విదేశీ పత్తి దిగుమతిని ఆహ్వానించడం, దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం వల్ల దేశీయ మార్కెట్లలో పత్తి ధర దాదాపు క్వింటాలుకు 1000 రూపాయలు తగ్గిందని, పత్తి రైతులు ఆదాయాన్ని కోల్పోతున్నారని తెలిపారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన పంటగా ఉన్న పత్తి రైతులను ఆదుకోవడానికి, ఆదిలాబాద్ జిల్లాలో కరువు మండలాలకు కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకురావడంలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.ఇప్పటికైనా పత్తి రైతులను కాపాడుకోవడానికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వాణిజ్య కొనుగోలు చేపట్టాలని, విదేశీ పత్తి దిగుమతిని ఆపకుంటే బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోడ్డు గంగారెడ్డి, కుచులాపూర్ గ్రామ సర్పంచ్ మైలి నారాయణ, ఉప సర్పంచ్, ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు సుద్దుల అరుణ్ రెడ్డి, రైతు నాయకుడు గడ్డల నారాయణ, ఉమేష్, దేవిదాస్, అనిల్, సాయి, సీనియర్ నాయకులు మహమ్మద్, మైనార్టీ మండల ప్రెసిడెంట్ అలిమోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

బాసరలో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం.. సహించం

• తాగునీరు, ఆహారం లేదు.. ప్రభుత్వమే బాధ్యత వహించాలి : జగన్ మోహన్



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) బాసర ట్రిపుల్ ఐటీలో చదువుకుంటున్న వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నెలకొన్న సమస్యలు రాష్ట్ర ప్రభుత్వ పాలనా నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్ అన్నారు. విద్యార్థులకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, సరైన వసతి సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి ఏర్పడటం అత్యంత బాధాకరమన్నారు.విద్యార్థులు చదువుకోవాల్సిన విద్యాసంస్థలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ఆందోళన చెందాల్సిన దుస్థితి ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. విద్యార్థుల తాగునీరు, ఆహారం, వసతి వంటి కనీస అవసరాలను తీర్చడం కూడా ప్రభుత్వానికి సాధ్యం కావడం లేదా అని నిలదీశారు.బాసర ట్రిపుల్ ఐటీ కేవలం ఒక విద్యాసంస్థ కాదని, వేలాది పేద బహుజన కుటుంబాల ఆశలు, పేద ప్రజల ఆకాంక్షలకు ప్రతీక అని అన్నారు. అలాంటి సంస్థలో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు ఉన్నాయనే ఫిర్యాదులు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖలు ఎందుకు తక్షణ చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఉన్నత విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా బాధ్యతతో స్పందించాలని, విద్యార్థుల సమస్యలపై ప్రకటనలు చేయడం కాదు, క్షేత్రస్థాయిలో పరిష్కారాలు చూపించాలని అన్నారు.విద్యార్థులకు ఏదైనా తీవ్రమైన అనారోగ్యం సంభవించినా, ప్రాణనష్టం జరిగినా బాధ్యత ఎవరిదని, ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోగలదా అని విమర్శించారు. విద్యార్థుల ప్రాణాల విషయంలో ఇకపై కాలయాపనకు తావులేదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ డిమాండ్ చేశారు.

అట్నంగూడ - భీంపూర్ రోడ్డుపై గుంతలే గుంతలు..



• ప్రాణాలతో చెలగాటం....రాత్రైతే ప్రమాదమే.. మరమ్మతులు ఎప్పుడో అంటున్న ప్రయాణికులు

(తలమడుగు/ తాంసి, సాక్షర) మండలంలోని అట్నంగూడ నుంచి భీంపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారింది.రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడి, తారు పూర్తిగా దెబ్బతినడంతో కంకర బయటకు తేలింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.ముఖ్యంగా రెండు మండలాల సరిహద్దు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు దుస్థితి కారణంగా ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారిని పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

పాఠశాల లైబ్రరీ అభివృద్ధికి రూ.30,000 విరాళం



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఆదిలాబాద్ అర్బన్‌లోని ఎంపీయూపీఎస్ కేఆర్కే కాలనీ తెలుగు మీడియం పాఠశాల లైబ్రరీ గదిలో ఫ్లోర్ టైల్స్ ఏర్పాటు చేయడానికి డా. కళ్లెం వెంకట్ రెడ్డి రూ.30,000 విరాళంగా అందించారు.పాఠశాల విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే సదుద్దేశంతో వారు అందించిన ఈ ఆర్థిక సహాయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తరపున హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు, లైబ్రరీని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి దాతల సహకారం ఎంతో దోహదపడుతుందని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. విద్యాభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో డా. కళ్యాణ్ వెంకట్ రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజియా సుల్తానా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ యాదవ్, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీరామ్, కిరణ్ కుమార్, కిషోర్, సునీత, శృతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లాలో 900 ఏళ్ల నాటి శాసనం..



• వనపర్తి జిల్లా కోటకొండలో 12వ శతాబ్దపు శాసనం గుర్తింపు

• కల్యాణి చాళుక్య చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుడి కాలం నాటిదిగా నిర్ధారణ

• భూదానాల వివరాలను వెల్లడించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

• తెలుగన్నడ లిపిలో ఉన్న ఈ శాసనాన్ని చదివి విశ్లేషించిన హరగోపాల్

తెలంగాణ చారిత్రక సంపదలో మరో కీలక ఆధారం వెలుగులోకి వచ్చింది. వనపర్తి జిల్లా, కోటకొండలోని ఒక శివాలయంలో సుమారు 900 ఏళ్ల నాటి పురాతన శాసనాన్ని చరిత్రకారులు గుర్తించారు. ఇది కల్యాణి చాళుక్య చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుడి (త్రిభువనమల్ల దేవుడు) కాలం నాటిదని నిర్ధారించారు. ఇప్పటివరకు ఎవరికీ అంతుచిక్కని ఈ శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు వెలుగులోకి తెచ్చారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు బైరోజు చంద్రశేఖర్, డా. బైరోజు శ్యామ్ సుందర్, హనుమానగరి వేమారెడ్డి, పండ్రప్రగ్గడ రామారావు ఈ శాసనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేశారు. బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ దీనిని చదివి చారిత్రక వివరాలను విశ్లేషించారు. శాసనంలో ఏముందంటే?: ఈ శాసనాన్ని క్రీ.శ. 1118 మే 22న వేసినట్లు గుర్తించారు. ఇది 12వ శతాబ్దపు తెలుగన్నడ లిపిలో, కన్నడ భాషలో ఉంది. శాసనం ప్రకారం, కాలాబోలవిరనోలబ మల్లదేశారెడ్డి అనే అధికారి, కదిరాజ అనే పూజారి పాదాలను కడిగి, సింగణగదనకొలను అనే ప్రాంతంలో 3 మత్తరుల తడి భూమిని దానంగా ఇచ్చినట్లు స్పష్టంగా ఉంది. శాసన స్తంభంపై 'త్రిభువనమల్ల దేవ' అనే పేరు ఉండటంతో ఇది విక్రమాదిత్యుడి కాలం నాటిదని ధ్రువీకరించారు. శిలాఫలకం మరోవైపు 'రామేశ్వర పండిత', 'సూర్యగ్రహణం' అనే పదాలు ఉన్నప్పటికీ, ఆ భాగం కొంత శిథిలమైంది. శ్రీ నాయక అనే మరో అధికారి కూడా భూదానం చేసినట్లు ఇందులో రాశారు. శాసనం ఉన్న స్తంభం మధ్యలో విరిగిపోయి ఉంది. ఇదే ఆలయంలో కాకతీయ శైలిలో ఉన్న చదునైన పానవట్టం (శివలింగం కింది భాగం)తో కూడిన శివలింగం, చాళుక్యుల శైలి నంది, గణపతి విగ్రహాలు, 16వ శతాబ్దానికి చెందిన భక్త ఆంజనేయ విగ్రహం ఉండటం విశేషం. ఈ శాసనం తెలంగాణ ప్రాంతంలో కల్యాణి చాళుక్యుల పాలన, వారి కాలం నాటి భూదానాల సంప్రదాయాలకు బలమైన చారిత్రక సాక్ష్యంగా నిలుస్తుందని పరిశోధకులు తెలిపారు.

తిరుమల శ్రీవారి ఆలయంలో పుష్పయాగం..

• తిరుమల శ్రీవారి ఆలయంలో నవంబర్ 16 పుష్పయాగం నిర్వహించనున్నారు

• పుష్పయాగం కారణంగా ఆర్జిత సేవలు రద్దు చేశారు



తిరుమల, సాక్షర: తిరుమల శ్రీవారి ఆలయంలో నవంబరు 16వ తేదీ పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రకటించింది. నవంబరు 15న సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. పుష్పయాగం రోజున ఆలయంలో రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు.ఆ రోజు మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. పుష్పయాగం కారణంగా నవంబర్ 16వ తేదిన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. తిరుమల శ్రీవారి భక్తులు ఈ విషయాన్ని గమనించాలని సూచిస్తున్నారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి రూ.2.25 లక్షల విలువైన వెండి తట్టను విరాళంగా అందించారు. టీటీడీలో సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీ ఎన్.టి. సుబ్బరాయుడు సోమవారం ఈ వెండి తట్టను ఆలయ ఏఈవో దేవరాజులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ సురేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతికి చెందిన వీకేఆర్ఆర్ ఫ్యూయల్ స్టేషన్ గ్రూప్స్ యజమాని మనోజ్ కుమార్ సోమవారం టీటీడీకి రెండు నగదు లెక్కింపు యంత్రాలను విరాళంగా అందించారు. వీటిలో ఒక యంత్రాన్ని తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి, మరొక యంత్రాన్ని అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి కేటాయించారు. ఈ యంత్రాలను తిరుచానూరు ఆలయ ఏఈవో దేవరాజులకు అందజేశారు. త్వరలో రెండు ఆలయాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ యంత్రాల ద్వారా హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ మరింత సులభతరం కానుంది. తిరుపతిలోని టీటీడీ అనుబంధ ఆలయాలైన శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, శ్రీ కోదండరామస్వామివార్ల ఆలయాల్లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దీపావళి ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీ పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి సాయంత్రం నూతన వస్త్రాలు, దీపాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం శాస్త్రోక్తంగా దీపావళి ఆస్థానం నిర్వహించారు. శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో దీపావళి ఆస్థానాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం నుంచి నూతన వస్త్రాలు, దోశపడి, దీపాలను తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలతో దీపావళి ఆస్థానం నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆలయంలో నిర్వహించే సహస్ర కలశాభిషేక సేవ, హనుమంత వాహనసేవను టీటీడీ రద్దు చేసింది.

గులాబీ మయమైన నిర్మల్ పట్టణం

• ఈనెల 11న బీఆర్ఎస్ రైతు గర్జన సభ కేటీఆర్ సభకు భారీ ఏర్పాట్లు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈనెల11న నిర్వహించనున్న బీఆర్ఎస్ రైతు గర్జన సభ నేపథ్యంలో పట్టణం గులాబీమయంగా మారింది. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు సభకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి.నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్న రైతు గర్జన సభ నిర్వహించనున్నారు. ఈ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బాల్క సుమన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి సభా వేదికను, అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై నాయకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎరువులు, విద్యుత్ సరఫరా సక్రమంగా జరగకపోవడంతో పంటల సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పరిస్థితిని తెలియజేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు గర్జన సభలను నిర్వహిస్తున్నారని తెలిపారు.ఈనెల 11 సాయంత్రం 4 గంటలకు నిర్మల్ ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించనున్న రైతు గర్జన సభకు అన్ని వర్గాల ప్రజలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు రామ్ కిషన్ రెడ్డి, జాన్సన్ నాయక్‌తో పాటు నాయకులు నల్ల వినయ్ రెడ్డి, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమరెవర్, మార్గొండ రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన



(ఆత్మకూరు, సాక్షర): విద్యార్థినీ విద్యార్థులు తమ వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ శక్తి యాప్ అవగాహన బృందం సిబ్బంది సూచించారు. ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజి నాయక్ ఉత్తర్వులతో, ఆత్మకూరు అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలో ఉన్న ఎంపీపీఎస్ యూబీ మోడల్ ప్రైమరీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, మహిళా హోంగార్డు సుప్రియ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అపరిచితులు లేదా తెలిసిన వ్యక్తులు మాయమాటలు చెప్పి ఎక్కడికైనా తీసుకెళ్లాలని ప్రయత్నిస్తే వెళ్లకూడదని, ఎవరైనా ఇచ్చే ఆహార పదార్థాలను తీసుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 100 లేదా 112కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం శక్తి యాప్ వినియోగంపై విద్యార్థులకు వివరించి, ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పాఠశాల మహిళా ఉపాధ్యాయుల మొబైల్ ఫోన్లలో సైతం శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి

సొంత గూటిలో కుమ్ములాట.. అసలు ఏం జరుగుతోంది?

ప్రత్యర్థులను రాజకీయంగా ఢీకొట్టాల్సిన వేళ.. సొంత గూటిలోనే ఎవరి మాట నెగ్గాలనే పోటీ మొదలైతే పార్టీ పరిస్థితి ఏమిటి? కీలక సమావేశంలో వాగ్వాదం.. రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదులు.. సీనియర్ నేత మరో పార్టీలో చేరిక! ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో 2026 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు చోటుచేసుకున్న పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఇవన్నీ విడివిడి ఘటనలా? లేక పార్టీలో పేరుకుపోతున్న అసంతృప్తికి సంకేతాలా? పదవుల ఎంపిక, నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తలకు తగిన గుర్తింపు వంటి అంశాలు పార్టీ అంతర్గత వ్యవహారాలపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. ప్రత్యర్థులతో రాజకీయ పోరాటం చేయాల్సిన పార్టీకి సొంత నాయకుల మధ్య సఖ్యతే సవాలుగా మారుతోందా? ఈ పరిణామాల వెనుక ఉన్న కారణాలను గుర్తించి, అందరినీ కలుపుకుపోయే కార్యాచరణ రూపొందించాల్సిన బాధ్యత రాష్ట్ర నాయకత్వంపై ఉంది.

పెద్దల ముందే పంచాయితీ..

2026 ఆగస్టు 17న ఉట్నూర్‌లో జరిగిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం సందర్భంగా చోటుచేసుకున్న వాగ్వాదం అంతర్గత విభేదాలను వెలుగులోకి తెచ్చింది. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి హాజరుపై ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సంజీవరెడ్డి కమిటీ సభ్యుడు కానందున సమావేశానికి ఎలా ఆహ్వానించారని కంది ప్రశ్నించినట్లు సమాచారం. పార్టీ అగ్రనాయకత్వం ఆహ్వానం మేరకే సమావేశానికి వచ్చానని, చాలాకాలంగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నానని సంజీవరెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఇరువర్గాల మద్దతుదారులు నినాదాలు చేయడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో జరిగిన ఈ ఘటన అనంతరం సంజీవరెడ్డి సమావేశ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. ఆగస్టు 20న పలువురు నేతలకు పార్టీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 7న కూడా కంది, సంజీవరెడ్డి పరస్పర ఫిర్యాదులపై పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. మరోవైపు, ఆగస్టు 29న బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ తన అనుచరులతో కలిసి గాంధీభవన్‌కు వెళ్లి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మండల కమిటీల్లో తమ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించలేదని, డీసీసీ అధ్యక్షుడు నరేశ్ జాధవ్ వ్యవహారశైలిపై అభ్యంతరాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను నరేశ్ జాధవ్ ఖండిస్తూ, పార్టీ నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నానని వివరణ ఇచ్చినట్లు కూడా కథనాలు వెలుబడ్డాయి. కాబట్టి ఈ వివాదంపై తుది నిర్ధారణకు పార్టీ విచారణ, ఇరువర్గాల వాదనలు కీలకం.



విభేదాల నుంచి వలసల వరకు.. కాంగ్రెస్‌కు సమన్వయ సవాలు!

అక్టోబర్ 3న వెలువడిన సమాచారం ప్రకారం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో పలువురు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షుల మధ్య కమిటీల ఏర్పాటు, నాయకత్వ ప్రాధాన్యత అంశాలపై విభేదాలు ఉన్నట్లు చర్చ సాగింది. పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ ఒకే స్థాయిలో సమస్యలు ఉన్నాయని చెప్పలేం. అయినప్పటికీ పలు ప్రాంతాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు వచ్చిన సమాచారం పార్టీ సమన్వయంపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. అక్టోబర్ 25న మాజీ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే బీఆర్ఎస్‌లో చేరడం మరో కీలక రాజకీయ పరిణామం. హైదరాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో జరిగిన చేరికతో ఆయన కాంగ్రెస్‌కు దూరమయ్యారు. పార్టీ మార్పునకు దారితీసిన కారణాలపై వ్యక్తిగతంగా ఆయన వెల్లడించిన అభిప్రాయాలే ప్రామాణికం. రాజకీయ వర్గాల్లో వినిపించే అంచనాలను నిర్ధారిత కారణాలుగా పరిగణించలేం. ఒక్క నాయకుడి చేరికతోనే పార్టీ బలహీనపడిందని చెప్పడం సరికాదు. కానీ వరుస ఫిర్యాదులు, బహిరంగ అసంతృప్తి, నాయకుల మధ్య విభేదాల చర్చ కొనసాగితే కార్యకర్తల్లో అయోమయం ఏర్పడే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఐక్యంగా పనిచేయాల్సిన శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం అవసరం.

వ్యక్తిగత అహాలకు స్వస్తి.. కార్యకర్తల విశ్వాసమే ముఖ్యం!

అంతర్గత విభేదాలకు పరిష్కారం కేవలం హెచ్చరికలు, నోటీసులతో సాధ్యం కాదు. నాయకుల మధ్య ముఖాముఖి చర్చలు జరిపి సమస్యల మూలాలను గుర్తించాలి. మండల కమిటీలు, నామినేటెడ్ పదవుల ఎంపికలో అర్హత, క్షేత్రస్థాయి పని, సామాజిక ప్రాతినిధ్యం, పార్టీకి చేసిన సేవ వంటి అంశాలకు స్పష్టమైన ప్రాధాన్యత ఇవ్వాలి. ఫిర్యాదులపై పక్షపాతం లేకుండా విచారణ జరిపి, ఇరువర్గాల వాదనలను వినాలి. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించాలి. రాష్ట్ర నాయకత్వం నియోజకవర్గ ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షుల మధ్య సమన్వయానికి స్పష్టమైన విధానం రూపొందించాలి. వ్యక్తిగత ఆధిపత్యం కంటే పార్టీ ప్రయోజనమే ముఖ్యమనే భావన నాయకుల్లో బలపడాలి. రాజకీయాల్లో విభేదాలు సహజమే. వాటిని చర్చలతో పరిష్కరించగలిగితే అవే పార్టీకి బలంగా మారతాయి. కానీ అవి బహిరంగ విభేదాలుగా మారితే ప్రత్యర్థులకు రాజకీయ అవకాశం కల్పించినట్లవుతుంది. నాయకుల్లో ఎవరు పైచేయి సాధించారన్నది కాదు.. కార్యకర్తల విశ్వాసాన్ని ఎవరు నిలబెట్టారన్నదే పార్టీ బలాన్ని నిర్ణయిస్తుంది. సొంత గూటిలోని కుమ్ములాటలకు ముగింపు పలికి ఐక్యతను చాటడమే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌కు ఇప్పుడు అసలైన సవాలు.

-



వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్ , సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ,ఫోన్: 9640466464

రైతులకు కేంద్రం ₹25 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి



• ఆదిలాబాద్ ప్రజలకు తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్

(ఆదిలాబాద్, సాక్షర) ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడటంతో తెలంగాణలో రైతాంగం, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన చలో కలెక్టరేట్ ధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్ర నష్టాలను ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించడంతో పాటు, వ్యవసాయ కూలీలు, ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరారు.అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ చిత్రుకి వినతిపత్రం అందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు తాగునీరు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.ఆదిలాబాద్ జిల్లాకు జీవనాధారంగా ఉన్న ప్రాజెక్టులకు జలవనరుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సమన్వయంతో శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నీటి వనరుల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలన్నారు.జిల్లాలో కరువు ప్రభావిత మండల ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టి, రైతులు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, పేద కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ₹25 వేల కోట్ల ప్రత్యేక కరువు సహాయ ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారం, ఉపాధి కల్పన, నిత్యావసర సరుకుల పంపిణీ, తాగునీటి సరఫరా వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ప్రజల కష్టాలు ప్రభుత్వాలకు పట్టకపోతే ప్రజా ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరిస్తూ, రైతాంగం, కార్మికవర్గం, పేద ప్రజల హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని కలవేన శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ ఎస్. విలాస్, రాష్ట్ర సమితి సభ్యులు ప్రభాకర్ రెడ్డి, సీపీఐ ఆదిలాబాద్ జిల్లా సీనియర్ నాయకులు చంద్రమౌళి, కట్ట కిష్టయ్య, బి. గోవర్ధన్, సిర్రా దేవేందర్, కే. గంగయ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు మేస్రం భాస్కర్, గేడం కేశవ్, సీపీఐ జిల్లా నాయకులు ఎండి ఫయాజ్, సంగీత, జాడే నామ్ దేవ్, పూజ, ఎండి పాషా, అర్ధాంగి రమేష్, కుంటాల రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు -జిల్లా కలెక్టర్ కె.హరిత



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర) మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని రెబ్బెన మండలం నంబాల గ్రామంలో ఇంద్ర మహిళా శక్తి సమాఖ్య ఆధ్వర్యంలో 6 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా ప్రతిరోజూ సుమారు 10 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి విక్రయించడం ద్వారా యూనిట్‌కు 3.31 రూపాయల చొప్పున ఆదాయం సమకూరుతుందని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో భారీ సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సంఘాల ఆర్థిక బలోపేతానికి దోహదపడుతుందని తెలిపారు. సోలార్ ప్యానెళ్లపై దుమ్ము, ధూళి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని, ప్యానెళ్ల శుభ్రతకు నిరంతరంగా నీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా ప్లాంట్ పరిసరాలలో రెండు బోర్లు వేయించాలని తెలిపారు. ప్లాంట్‌కు విద్యుత్ పరికరాలు, నిర్వహణ సామగ్రి, వాహనాలు సులభంగా చేరుకునే విధంగా రహదారికి అవసరమైన మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దాలని సూచించారు. నిర్దేశిత సామర్థ్యానికి అనుగుణంగా నిరంతర విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ప్లాంట్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని, మహిళా సమాఖ్యకు నిరంతర ఆదాయం సమకూరే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళా సంఘాలు సంప్రదాయ పొదుపు, రుణ కార్యకలాపాలకే పరిమితం కాకుండా సౌర విద్యుత్ ఉత్పత్తి వంటి ఆదాయాన్ని సమకూర్చే భారీ ప్రాజెక్టులను చేపట్టడం అభినందనీయమని, ఇటువంటి ప్రాజెక్టుల ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో పునరుత్పాదక ఇంధన వినియోగం పెంపొందుతుందని తెలిపారు. సోలార్ ప్యానెళ్లను, విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థను, ప్లాంట్ నిర్వహణకు సంబంధించిన ఇతర సదుపాయాలను పరిశీలించారు. ప్లాంట్‌కు వెళ్లే రహదారి దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండటాన్ని గమనించి, ప్లాంట్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, విద్యుత్ శాఖ ఎస్.ఈ. ఉత్తమ్ జాడే, ఇంద్ర, గౌతమి, జంగుబాయి, తిర్యాణి, ఆసిఫాబాద్ మండల సమాఖ్యలకు చెందిన మహిళా శక్తి సమాఖ్య సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో దెబ్బ.. ఎకరానికి 1, 2 క్వింటాళ్లే పత్తి

• దీపావళికీ రైతు ఇంట్లో వెలుగు లేదు.. నష్టపరిహారం ఇవ్వాలని జోగు రామన్న డిమాండ్



(జైనథ్, సాక్షర) ఆశించిన స్థాయిలో పంట దిగుబడి చేతికి రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రైతుల సమస్యలపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం జైనథ్ మండలం సాంగి గ్రామంలో పలు రైతు కుటుంబాలను జోగు రామన్న పరామర్శించారు. పత్తి చేలో పత్తి ఏరుతున్న రైతులను కలిసి పంట దిగుబడి, నాణ్యత, ప్రస్తుత పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఒక ఎకరానికి ఆశించిన స్థాయిలో పత్తి దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో తీవ్రంగా నష్టపోతున్నామని, ఎకరానికి ఒకటి, రెండు క్వింటాళ్ల పత్తి మాత్రమే వస్తోందని రైతులు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పత్తిని పరిశీలించి నాణ్యతను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే రైతులకు నష్టపరిహారం అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాకపోవడం విచారకరమన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున పలుమార్లు రైతుల సమస్యలను అధికారుల, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.రైతులెవరూ అధైర్యపడవద్దని, రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే పాలన రావాలని, రైతు రాజ్య స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు.దీపావళి పండుగ సమయంలోనూ రైతుల కుటుంబాల్లో ఆనందం లేకుండా పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దేవన్న, కొండ గణేష్, దమ్మాపాల్ తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి



• సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో పోలీసులు బాధ్యతాయుతంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో పోలీస్ స్టేషన్లలో రిసెప్షనిస్ట్ విధులు నిర్వహించే సిబ్బందితో నేరుగా, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సర్కిల్ అధికారులు, డీఎస్పీలతో వీసీ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా మాట్లాడుతూ వారి సమస్యలను ఓపికగా వినాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వెంటనే సంబంధిత దర్యాప్తు అధికారులను నియమించి విచారణ ప్రారంభించాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి నిర్ణీత సమయంలో విచారణ పూర్తి చేసి సరైన నివేదిక అందించాలని సూచించారు.పలు ఫిర్యాదుల విషయంలో ఎస్ఐ స్థాయి అధికారులు నేరుగా దర్యాప్తులో పాల్గొని విచారణ కొనసాగించాలని, బాధితులకు పోలీసులపై నమ్మకం కలిగించే విధంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించినప్పుడే పోలీస్ శాఖ గౌరవం, కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయని పేర్కొన్నారు.రాష్ట్రస్థాయిలో రిసెప్షన్ వర్టికల్‌పై సమీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా మరింత మెరుగైన పనితీరును కనబరచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల వారీగా నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని తెలిపారు. దర్యాప్తు అనంతరం ప్రజలు అందించే అభిప్రాయాలు పోలీసుల పనితీరుకు అనుగుణంగా ఉండేలా న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారణ జరపాలని సూచించారు.ప్రతి ఫిర్యాదును క్రమబద్ధీకరిస్తూ, సంఘటన స్థలంలో అవసరమైన విచారణ చేపట్టి, బాధితులకు సరైన న్యాయం జరిగేలా పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీఆర్బీ ఎస్ఐ ప్రవీణ్, రిసెప్షనిస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మెనూ మార్పు... నిర్వహకులపై కలెక్టర్ ఆగ్రహం

• మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కస్తూర్బా బాలికల విద్యాలయం తనిఖీ



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెండోరా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, టాయిలెట్లు, తరగతి గదులను పరిశీలించారు. స్టోర్ రూంలో నిలువ ఉన్న పండ్లు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను గమనించారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా సిబ్బంది హాజరును తనిఖీ చేశారు.విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూలో పేర్కొన్న క్యారెట్ కర్రీకి బదులుగా ఆలూ కర్రీ వండడాన్ని గమనించిన కలెక్టర్, నిర్వాహకులను నిలదీశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో డైట్ మెనూ రూపొందించిందని, దానిని పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తే ప్రయోజనం ఏమిటని మందలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు.పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, నిరుపయోగ వస్తువులు ఉండడాన్ని గమనించారు. పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. తాను మరోమారు ఆకస్మిక తనిఖీకి వస్తానని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నిర్మాణ దశలో ఉన్న పాఠశాల ప్రహరీ గోడ పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు.అనంతరం 6వ తరగతి గదిని కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను అందించి చిన్నారులను ప్రోత్సహించారు. చక్కగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు.కలెక్టర్ వెంట స్థానిక ఎంపీడీఓ లక్ష్మణ్, ఎంఈఓ శ్రీనివాస్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ తదితరులు ఉన్నారు.

ఆర్ఓబి, ఆర్బీయూబి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ఎమ్మెల్యే పాయల్ శంకర్



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): ఆదిలాబాద్ నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే ఆర్ అండ్ బి శాఖ చీఫ్ ఇంజనీర్, సంబంధిత అధికారులతో కలిసి ఆర్ఓబి, ఆర్బీయూబి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూసేకరణ సమస్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోందని, ఇకపై అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రైల్వే శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వాటా లేకుండానే రూ.104.50 కోట్ల నిధులను తీసుకురావడంలో కృషి చేశామని, అలాగే పెండింగ్‌లో ఉన్న భూసేకరణకు సంబంధించి రూ.14.80 కోట్ల నిధులు విడుదల చేయించామని తెలిపారు.నిధులు తీసుకురావడం తన బాధ్యతగా భావించి కృషి చేశానని, ఇప్పుడు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.భూసేకరణకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచుకుని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే పాయల శంకర్

• రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిలు పనులను వేగవంతం చేయాలి



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) ఆదిలాబాద్ పట్టణంలోని నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్ తో కలిసి ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోడ్ల విస్తరణ పనులను ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రారంభం నుండి ముగింపు వరకు కచ్చితమైన మ్యాపింగ్ చేయాలని స్పష్టం చేశారు. ల్యాండ్ అక్విజిషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసి, ఇందుకు సంబంధించిన బాధ్యతలను మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బీ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా కోల్పోయిన బోర్ వెల్స్ కు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, అలాగే మాస్క్ పేమెంట్స్, బోర్ వెల్ పేమెంట్స్ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. బ్రిడ్జిలతో పాటు రోడ్ల విస్తరణ పూర్తి కాకపోవడంతో ప్రజలకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వర్ రావు, చీఫ్ ఇంజనీర్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆర్ అండ్ బీ ఈఈ రమేష్, రైల్వే, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ లో వంద శాతం అభ్యసన ఫలితాలు సాధించాలి -జిల్లా కలెక్టర్ కె.హరిత



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర) ఎఫ్ఎల్ఎన్ లో వంద శాతం అభ్యసన ఫలితాలు సాధించే దిశగా ప్రత్యేక కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో ఎఫ్ఎల్ఎన్ వంద శాతం అభ్యసన ఫలితాల సాధనకు మిషన్ వంద శాతం లెర్నింగ్ ప్రత్యేక కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్యానెల్ ఇన్ స్పెక్షన్ బృందం సభ్యులు పాఠశాలలను సందర్శించి గుర్తించిన అంశాలు, పరిశీలనలపై సమీక్షించాలని, ఎఫ్ఎల్ఎన్ మిడ్ లైన్ అసెస్ మెంట్ లో అద్భుతమైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు.విద్యార్థులలో చదవడం, రాయడం, గణిత సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు విద్యార్థుల అభ్యసన స్థాయిలను నిరంతరం పర్యవేక్షిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, మండల విద్యాధికారులు, ప్రభుత్వ, స్థానిక సంస్థల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్యానెల్ ఇన్ స్పెక్షన్ బృంద సభ్యులు, ఎఫ్ఎల్ఎన్ సామర్థ్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ

• ప్రారంభించనున్న రేవంత్ రెడ్డి

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు ఆక్రమణల చెర నుంచి బయటపడి కొత్త రూపు సంతరించుకుంది. ఒకప్పుడు మురుగునీరు, ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధభరితంగా మారిన ఈ చెరువు.. ఇప్పుడు పచ్చదనం, వాకింగ్ ట్రాక్, యోగా వేదిక వంటి సౌకర్యాలతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు సిద్ధమైంది. హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువును ప్రారంభించి నగర ప్రజలకు అంకితం చేయనున్నారు. శేరిలింగంపల్లి మండలం మాదాపూర్‌లో శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంటను హైడ్రా మొదటి విడతలో పునరుద్ధరించిన ఆరు చెరువుల్లో ఒకటిగా పేర్కొన్నారు.ఇప్పటికే పాతబస్తీలోని బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, కూకట్‌పల్లిలోని నల్లచెరువును సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇప్పుడు తమ్మిడికుంట ప్రారంభానికి సిద్ధమైంది. అనంతరం మాదాపూర్‌లోని సున్నం చెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువును కూడా ప్రారంభించాల్సి ఉంది. ఈ నెల 11వ తేదీన సీఎం రేవంత్ తమ్మిడికుంటను ప్రారంభించనున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం అక్కడ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభోత్సవ వేదిక, ప్రముఖులు, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సీటింగ్, వాహనాల పార్కింగ్, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను అధికారులతో కలిసి సమీక్షించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.చెరువు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన విమోస్ టెక్నోక్రాట్స్ అధినేత యూనస్ పర్వేజ్.. చేపట్టిన పనులు, కల్పించిన సౌకర్యాలను అధికారులకు వివరించారు. తమ్మిడికుంట అసలు విస్తీర్ణం దాదాపు 30 ఎకరాలు కాగా.. ఆక్రమణల కారణంగా అది కేవలం 14 ఎకరాలకు పరిమితమైంది. ఎన్ కన్వెన్షన్‌తో పాటు చెరువు పరిధిలోని ఇతర ఆక్రమణలను తొలగించి భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంతో చెరువు విస్తీర్ణం మళ్లీ పెరిగింది. ప్రస్తుతం దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. చెరువు పరిరక్షణలో కీలక పరిణామంగా నిలిచిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత 2024 ఆగస్ట్ 24వ తేదీన జరిగింది. అనంతరం చెరువు పరిధిలోని ఇతర ఆక్రమణలను గుర్తించి తొలగించే చర్యలు చేపట్టారు. దీంతో చెరువు తన పూర్వ విస్తీర్ణాన్ని తిరిగి పొందేందుకు మార్గం ఏర్పడిందిగతంలో చెరువు చుట్టూ ముళ్ల పొదలు, వ్యర్థాలు పేరుకుపోయి ఉండేవి. మురుగునీరు నేరుగా చెరువులోకి చేరడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, దోమల సమస్యలు తలెత్తేవి. బయోమెడికల్ వ్యర్థాలు కూడా అక్కడ పడేయడంతో నీరు, పరిసర భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు హైడ్రా పూడికతీత, వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టింది. సుమారు 15 అడుగుల లోతు వరకు పేరుకుపోయిన పూడికను తొలగించింది. ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలు, బండరాళ్లను బయటకు తీసింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి చేరిన నీరు భూమిలోకి ఇంకేందుకు కూడా అవకాశం ఏర్పడింది.తమ్మిడికుంట పునరుద్ధరణలో భాగంగా చెరువులోకి మురుగునీరు చేరకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని హాస్టళ్ల నుంచి వచ్చే మురుగునీటిని చెరువులోకి మళ్లకుండా అడ్డుకున్నారు. చెరువు చుట్టూ మురుగునీటి ప్రవాహాన్ని మళ్లించే కాలువ వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇందుకోసం 1,200 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. వర్షపు నీరు సక్రమంగా చెరువులోకి చేరేందుకు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్‌ను పునరుద్ధరించారు. క్యాచ్‌మెంట్ డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరిచి, గతంలో మట్టితో కప్పుకుపోయి నిరుపయోగంగా మారిన నీటి ప్రవాహ మార్గాలకు తిరిగి జీవం పోశారు.దిగువన ఉన్న ముండ్లకత్వ చెరువుతో సహజ నీటి అనుసంధానాన్ని పునరుద్ధరించేందుకు కూడా చర్యలు చేపట్టారు. గతంలో కొండాపూర్, మాదాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు శిల్పారామం పరిసరాల్లో నిలిచిపోయి ముంపునకు కారణం అయ్యేది. ఇప్పుడు ఇన్‌లెట్ల అభివృద్ధితో వరద నీరు నేరుగా తమ్మిడికుంటలోకి చేరేలా ఏర్పాట్లు చేశారు. దీంతో వర్షాకాలంలో శిల్పారామం పరిసరాల్లో నీరు నిలిచే సమస్య తగ్గే అవకాశం ఉంది.తమ్మిడికుంటను కేవలం నీటి నిల్వ కేంద్రంగా కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ప్రాంతంగా తీర్చిదిద్దారు. ఇందుకోసం మొత్తం రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ 1.25 కిలోమీటర్ల పొడవున వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ట్రాక్ వెంట మొక్కలు నాటి పచ్చదనం పెంచడంతో పాటు ల్యాండ్‌స్కేపింగ్ పనులు చేపట్టారు. ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు బెంచీలు, సమూహ కార్యక్రమాల కోసం రెండు గెజిబోలు, యోగా వేదిక, రోజ్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించడంతో పాటు ఎఫ్‌టీఎల్ పరిధిలో శాశ్వత ప్రహరీ ఏర్పాటు చేశారు. ప్రజల రాకపోకల కోసం రెండు ప్రవేశ ద్వారాలను నిర్మించారు. క్రీడా సదుపాయాలు, ఇతర ప్రజోపయోగ పనులు కూడా చేపట్టారు.తమ్మిడికుంటలోకి చేరే మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఎస్‌టీపీ నిర్మాణాన్ని కూడా హైడ్రా ప్రతిపాదించింది. ఇది అమలైతే చెరువులోకి మురుగునీరు చేరకుండా నియంత్రించడంతో పాటు దిగువన ఉన్న మూసీ నదిలోకి వెళ్లే కాలుష్య భారాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. చెరువు పునరుద్ధరణతో వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడం, భూగర్భ జలాల పునర్భరణకు తోడ్పడటం, దిగువ చెరువులతో సహజ నీటి ప్రవాహ వ్యవస్థ మెరుగుపడటం వంటి ప్రయోజనాలు కలగనున్నాయి. నగరంలో చెరువుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో తమ్మిడికుంటను తిరిగి దాదాపు 30 ఎకరాలకు విస్తరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాన ఐటీ కారిడార్‌లో ఉన్న ఈ చెరువు పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణకు, వరద నీటి నిర్వహణకు, స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన బహిరంగ ప్రదేశం అందుబాటులోకి రావడానికి అవకాశం ఏర్పడింది

నాపై వస్తున్న ఆరోపణలను విచారణతో నిగ్గుతేల్చండి..

• రాష్ట్ర డీజీపీకి అగ్రి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లేఖ

(హైదరాబాద్, సాక్షర): తనపై వస్తున్న లైగింక వేధింపుల ఆరోసణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (PJTSAU) ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌కు లేఖ రాశారు. తన ప్రతిష్టను దిగజార్చేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు. వాట్సాప్ చాట్‌లు, కాల్ హిస్టరీ వంటి ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ బదిలీల విధానంలో భాగంగా సెప్టెంబర్ 11, న ఒక మహిళా ఫ్యాకల్టీని నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి బదిలీ చేసినట్లు వీసీ జానయ్య వివరించారు. 12 ఏళ్లుగా అక్కడే పనిచేస్తున్న మరో అధ్యాపకుడి స్థానంలో పరిపాలనాపరమైన అవసరాల దృష్ట్యా ఈ సాధారణ బదిలీ జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ బదిలీ ఇష్టం లేని సదరు మహిళా ఫ్యాకల్టీ కక్షపూరితంగా తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సదరు ఫ్యాకల్టీ, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో తాను వేధింపులకు గురైనట్లు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై 11 నెలల పాటు మౌనంగా ఉండి, బదిలీ జరిగిన తర్వాతే ఫిర్యాదు చేయడం వెనుక ఉన్నది కేవలం కక్షసాధింపు చర్యేనని వీసీ స్పష్టం చేశారు. తాను తెచ్చిన సంస్కరణలు నచ్చని కొందరు స్వార్థపరుల ప్రోద్బలంతోనే ఆమె ఈ అసత్య ప్రచారానికి తెరతీశారని జానయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో మొదటిసారి ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ఎదుర్కోవడం తనతో పాటు తన కుటుంబ సభ్యులకు ఎంతో బాధ కలిగిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని డీజీపీని అభ్యర్థించారు.

కరీంనగర్‌కు నితిన్ నబీన్..

• ఈ నెల 18న కరీంనగర్‌కు నితిన్ నబీన్ రాక
• లక్ష మందితో మహా పాదయాత్రకు బీజేపీ ఏర్పాట్లు
• బండి సంజయ్ నేతృత్వంలో కార్యక్రమ నిర్వహణ
• గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు యాత్ర
• పాదయాత్రలో పాల్గొననున్న రాంచందర్‌రావు



కరీంనగర్, సాక్షర: తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ‘సర్’ అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ నిర్ణయించారు. గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. ఇందులో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సమీకరించాలని సూచించారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

ఐటీ టవర్ ప్రారంభోత్సవంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

• యువత ఉద్యోగాలపై ఎంపీ, ఎమ్మెల్యేలకు పట్టింపు లేదా..? మాజీ మంత్రి జోగు రామన్న



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) ఆదిలాబాద్ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభోత్సవంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు.పండగ పూట యువతకు ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లుతూ నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు.రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు దీటుగా ఆదిలాబాద్‌లో ఐటీ పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ టవర్‌ను అన్ని హంగులతో నిర్మించామని తెలిపారు. భవన నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభోత్సవంపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న జరగాల్సిన ప్రారంభోత్సవాన్ని చివరి నిమిషంలో ఎందుకు వాయిదా వేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మరోవైపు ఆదిలాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు యువత ఉద్యోగాల విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారని జోగు రామన్న ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే, యువతకు ఉద్యోగాలు కల్పించే ఐటీ టవర్ ప్రారంభంపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై లేదా అని అన్నారు. కమిషన్లు వచ్చే ప్రాజెక్టులపై చూపిస్తున్న శ్రద్ధలో కొంతైనా యువత భవిష్యత్తుపై చూపించాలని హితవు పలికారు.ప్రతిపక్షంలో ఉండి కూడా యువత ఉద్యోగాల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారా? లేక యువత భవిష్యత్తు పట్ల వారికి పట్టింపు లేదా? అని ఎంపీ, ఎమ్మెల్యేల వైఖరిని నిలదీశారు.ఐటీ టవర్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారు? నిజంగా ప్రారంభిస్తారా లేదా? అనే అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐటీ పరిశ్రమలు ప్రారంభమైతే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి ఐటీ టవర్‌ను ప్రారంభించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో యువత పక్షాన ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తామని జోగు రామన్న హెచ్చరించారు.

ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న వారికి మరో అవకాశం :అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఏఎస్‌డీడీ జాబితాలో నమోదు అయినా వారికి తమ ఓటు హక్కు ను పొందెందుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించందని అదనపు కలెక్టర్ ఆర్ ఎస్ చిత్రు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఆయన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఏఎస్‌డీడీ జాబితాలో పేర్లు ఉన్నవారు మరోసారి అనెక్సర్ -ఏ ఎన్యుమరేషన్ ఫారం నింపి సమర్పించడం ద్వారా ఓటరు జాబితాలో తమ పేరును పునరుద్ధరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. స్థానికంగా ఉండి ఇంతవరకు ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వనివారు అనెక్సర్-బి ద్వారా సమర్పించాలన్నారు. అలాగే నివాసం మారినవారు అనెక్సర్ -సి నింపడంతో పాటు నివాస ధ్రువపత్రం సమర్పించావాల్సి ఉందన్నారు. అయితే ఇది కేవలం ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్నవారికే మరో అవకాశం ఉందాని, ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయవలసి ఉందన్నారు.

రూ.66కే బియ్యం

(నిజామాబాద్, సాక్షర): బియ్యం ధరలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం ధరలకు గరిష్ట పరిమితులు విధించింది. కొంతమంది ఎక్కువ ధరలకు బియ్యంను విక్రయిస్తున్న క్రమంలో దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బియ్యం ధరలను ఫిక్స్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలులోపే బియ్యం విక్రయించాలి. అంతకంటే అధిక ధరలకు విక్రయిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. బియ్యం రకాలను బట్టి గరిష్ట ధరలను ఫిక్స్ చేసింది. అలాగే బియ్యం బస్తాలపై గరిష్ట చిల్లర ధరలను కూడా ముద్రించాల్సిందేనని ఆదేశించింది. అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. బియ్యం ధరల్లో మోసాలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించింది.బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యంకు సంబంధించి కిలో గరిష్ట ధర రూ.66గా ఫిక్స్ చేసింది. ఇక ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం కిలో గరిష్ట ధర రూ.74గా పరిమితి విధించింది. అలాగే హెచ్ఎంటీ, జైశ్రీరాం రకం బియ్యం గరిష్ట చిల్లర ధర రూ.79గా నిర్ణయించింది. ఎల్నినో ప్రభావం క్రమంలో పంట దిగుబడి తగ్గడంతో బియ్యం ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయి. తెలంగాణలోనూ బియ్యం ధరలు పెరగ్గా.. కొంతమంది వ్యాపారులు దీనిని అసరాగా తీసుకుని ధరలు పెంచేస్తున్నారు. కిలో రూ.100, ఆపై ధరలకు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోంది. దీంతో బియ్యం ధరల పెరుగుదలకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. రాష్ట్రంలో బియ్యం కొరత ఉందనే ప్రచారాన్ని ప్రభుత్వం తిప్పికొట్టింది. తగినన్ని నిల్వలు ఉన్నాయని, అందులో ఎలాంటి సమస్య లేదని పేర్కొంది. మార్కెట్ ధరలను తారుమారు చేయడం, బియ్యంను అక్రమంగా నిల్వచేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ హెచ్చరించింది. నిరంతరం మిల్లర్లు, వ్యాపారులపై తనఖీలు జరుగుతాయని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపింది. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. రిటైల్ దుకాణాలు, టోకు వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పడే పడే అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లోపు మాత్రమే బియ్యం అమ్మాలని తెలిపింది. కాగా తెలంగాణలో బియ్యం ధరలు భారీగా పెరిగాయి. బహిరంగ మార్కెట్లో కిలో రూ.100 వరకు చేరుకున్నాయి

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com